ప్రజాశక్తి

శుక్రవారం 21 నవంబర్ 2025 — 8 పేజీలు





గుంటూరు — పల్నాడు

వరి కోతలు ప్రారంభం

- ధాన్యం కొనుగోలుకు తప్పని ఆంక్షలు
- విక్రయానికి ఇబ్బందులు పడుతున్న రైతులు
- జిల్లాలో 47 సేకరణ కేంద్రాలు ప్రారంభం



కొల్లిపర మండలం దావులూరు వద్ద వరి కోతలకు సిద్ధమైన రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

జిల్లాలో వరికోతలు ప్రారంభమయ్యాయి. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో జులై, ఆగస్టు నెలలో వెదపద్ధతిలో సాగుచేసిన ప్రాంతాల్లో రెండు మూడ్రోల కిందటి నుండి కోతలను ప్రారంభించారు. ఒకవైపు తుపాను హెచ్చరికలు రైతులను భయపెడుతుండగా వరి కోసిన తరువాత తుపాను వస్తే ఏం చేయాలని రైతులు తర్జన భర్జనలు పడుతున్నారు. ఈ క్రమంలో కొందరు వరికోత యంత్రాలను ఉపయోగిస్తుండడంతో ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉంటోంది. వీటిని కొనుగోలు కేంద్రాలకు తీసుకువెళ్తే అధికారులు, మిల్లర్లు విధిస్తున్న ఆంక్షలు రైతులను ఇబ్బంది పెడుతున్నాయి. ప్రధానంగా తేమ 17 శాతంమించితే కొనడం లేదు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో తేమ శాతం కనీసం 20 నుంచి 28 వరకు ఉంటుందని మిల్లర్లు చెబుతుండగా, ఆరబెట్టుకుని తీసుకురావాలని అధికారులు చెబుతున్నారు. ఆరబెట్టుకునేందుకు తగిన వసతులు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రోడ్డుపై ధాన్యాన్ని పోయాల్సి వస్తోందని పలువురు రైతులు తెలిపారు.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.55 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. దాదాపు 3.50 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా ఇందులో ప్రస్తుతం 70 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ప్రభుత్వం అధికారులకు లక్ష్యం విధించింది. 209 రైతు సేవా కేంద్రాల పరిధిలో 47 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజరు తులసి తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ఆంక్షల నేపథ్యంలో మార్కెట్‌లో దళారులకు 75 కిలోల బస్తా రూ.1400 నుంచి రూ.1450కి కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది ప్రభుత్వం 'ఎ' గ్రేడ్ ధాన్యానికి క్వింటాళ్ రూ.2389గా ప్రకటించింది. దీని ప్రకారం 75 కిలోల బస్తా రూ.1792కు కొనుగోలు చేయాలి. సాధారణ రకం ధాన్యానికి మద్దతు ధర రూ.2369గా ప్రకటించారు. దీని ప్రకారం 75 కిలోల బస్తా రూ.1776కు కొనాలి. అయితే వ్యాపారులు దాదాపు రూ.300-350 వరకు తగ్గించి అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. మరో వైపు

▶ 2లో



దావులూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్

ధాన్యం కొన్న ఆరు గంటల్లో నగదు

- బస్తాకు రూ.1792 మద్దతు ధర
- రాష్ట్ర వ్యాప్తంగా 51 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం
- దావులూరులో కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి మనోహర్

ప్రజాశక్తి - తెనాలి, కొల్లిపర, తాడేపల్లి రూరల్

రైతుల వద్ద ధాన్యం మొత్తాన్ని జిల్లా మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) ద్వారా మద్దతు ధరకు కొనడంతోపాటు ఆరు గంటల్లోనే నగదునూ జమ చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. కొల్లిపర మండలం దావులూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి గురువారం ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి సుమారు రూ.1674 కోట్లను చెల్లించలేదని, అయితే కూటమి ప్రభుత్వం మొదటి నెలలోనే రూ.వెయ్యి కోట్లు, రెండో నెలలో రూ.600 కోట్లు చెల్లించిందని తెలిపారు. రైతుల వద్ద కొన్న ధాన్యాన్ని విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం కోసం వినియోగిస్తామని, ఈ ఏడాది 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నా మని చెప్పారు. బస్తా రూ.1792కు కొంటామని,

▶ 2లో



విలేకర్లతో మాట్లాడుతున్న పాశం రామారావు, ఇతర నాయకులు

అన్నదాత సుఖీభవను కౌల్దార్లకు వర్తింపజేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలురైతులకు వర్తింపజేయాలని కౌలురైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు కోరారు. బ్రాడీపేటలోని సంఘం కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 70 శాతం భూమిని సాగు చేస్తున్న కౌలు రైతులకు ప్రభుత్వ సాయం అందక అన్ని విధాలుగా నష్టపోతున్నారని అన్నారు. గత ప్రభుత్వ తెచ్చిన కౌల్దార్ల చట్టంలో కౌల్దార్ల సంక్షేమానికి ఆటంకంగా మారిందన్నారు. దీనిని సవరిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం రెండేళ్లవుతున్నా పట్టించుకోవట్లేదని, దీంతో కౌలురైతులకు గుర్తింపు కార్డులు దక్కట్లేదని, ఫలితంగా రుణాలుగానీ, ప్రభుత్వ సబ్సిడీలు, ఇతర పరిహారాలు కూడా పొందలేకపోతున్నారని తెలిపారు. గుర్తింపు కార్డు కోసం భూ యజమాని సంతకం నిబంధన తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రకృతి విపత్తుల కారణంగా, మద్దతు ధరలు దక్కక కౌలురైతులు అప్పుల పాలవుతున్నారని, వారిని ప్రభుత్వం ఆదుకోకుంటే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. అభివృద్ధి పేరుతో లక్షల ఎకరాలు సారవంతమైన భూముల్ని కార్పొరేట్లకు కట్టబెడుతూ వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో రైల్వేలైన్ల నిర్మాణం కోసం గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం జరిగే భూసేకరణకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని, గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు, నల్లమడ వాగు ఆధునీకరణకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.రామకృష్ణ, ఎం.నాగమల్లేశ్వర రావు మాట్లాడుతూ ఇటీవల

▶ 2లో

రూ.150 కోట్లతో కేంద్రీయ గ్రంథాలయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : రాజధానిలో రూ.150 కోట్లతో కేంద్రీయ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. అరండల్‌పేటలోని జిల్లా గ్రంథాలయ సంస్థలో గురువారం సాయంత్రం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ఐదెకరాల్లో రూ.150 కోట్లతో కేంద్ర గ్రంథాలయం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఈ గ్రంథాలయంలో రెండు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవనాలు నిర్మిస్తామని, వివిధ విభాగాలకు చెందిన పుస్తకాలు ప్రజలకు అందుబాటులో ఉంచుతామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 924 శాఖా గ్రంథాలయాలను డిజిటల్ గ్రంథాలయాలుగా మార్చేందుకు శ్రీకారం చుట్టామని, ఇందులో భాగంగా త్వరలో మంగళగిరిలో డిజిటల్ లైబ్రరీగా ప్రారంభించనున్నామని చెప్పారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ చిన్నారులను గ్రంథ పఠనం వైపు మళ్లించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ, గ్రంథాలయ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



4 లో

అర్ధాకలితోనే ధర్నా చేస్తున్నాం

తప్పిపోయిన చిన్నారిని తల్లి వద్దకు చేర్చిన పోలీసులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



నరసరావుపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూడు బావుల సెంటర్‌లో నివాసం ఉండే వేల్పూరి మంగమ్మ, ధనబాబు దంపతుల కుమార్తె ఎస్తేరు ఇంటి వద్ద ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. స్పందించిన ఎస్ఐ లేఖ ప్రియాంక పోలీసు సిబ్బందితో పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. స్థానికంగా ఉన్న సిసి కెమెరాలను పరిశీలించి బాలిక శిశు మందిర్ వద్ద ఉన్నట్లు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఎస్ఐతోపాటు ఎఎస్ఐ రాములు, పోలీసు సిబ్బందిని డీఎస్పీ ఎం.హనుమంతరావు అభినందించారు.



బ్యాడ్మింటన్ రాష్ట్ర జట్టుకు వాగ్దేవి విద్యార్థి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : విశాఖపట్నంలో ఈనెల 14, 15 తేదీల్లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-19 బ్యాడ్మింటన్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి షేక్ మొహమ్మద్ నిసార్ ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు వాగ్దేవి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఓగూరి నాగేశ్వరరావు గురువారం తెలిపారు. వచ్చేఏడాది జనవరి 10 -15 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు మొహమ్మద్ ప్రాతినిధ్యం వహిస్తాడని చెప్పారు. ఎంపికైన విద్యార్థిని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామ కోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పివి.అచ్యుతరావు, పీడీ ఆర్.ఆంజనేయులు అభినందించారు.



రైతుల ఆర్థిక, సామాజిక ప్రగతిలో కీలకంగా సహకార బ్యాంకులు : చీఫ్ విప్ జీవీ

ప్రజాశక్తి - వినుకొండ : రైతుల ఆర్థిక, సామాజిక ప్రగతిలో కేంద్ర సహకార బ్యాంకులు, సహకార సంఘాలది కీలకపాత్రని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. వ్యవసాయ రుణాలతో పాటు గృహ, చదువులకూ రుణాలిస్తూ డీసీసీబీలు పరిధిని విస్తరిస్తుండడం హర్షణీయమని చెప్పారు. శావల్యాపురంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు గురువారం నిర్వహించగా డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావుతో కలిసి చీఫ్‌విప్ హాజరై మాట్లాడారు. ఎరువుల పంపిణీలో సహకార సంఘాలు, సహకార బ్యాంకులు కీలక భూమికని, గతంలో ధాన్యం, కందుల, శనగల కొనుగోలు, విత్తనాలు, పురుగు మందుల పంపిణీ ద్వారా సొసైటీలు కష్టకాలంలో రైతుల్ని ఆదుకునేవని చెప్పారు. తక్కువ వడ్డీకి వారిస్తున్న రుణాల్లోనూ ప్రభుత్వం పావలా వడ్డీ కింద కొంత మొత్తం తిరిగి చెల్లిస్తోందన్నారు. అకాల వర్షం, తుపాన్ల వంటివిపత్తుల నుంచి రక్షణకు ప్రభుత్వం అందిస్తోన్న పంటల బీమా కోసం ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని రైతులను కోరారు. ఉద్యాన, కూరగాయల పంటల ద్వారా ఆదాయ మార్గాల్లోకి మారాలన్నారు.

వరి కోతలు ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

శనివారం అల్పపీడనం పడే అవకాశంఉందని, ఇది తుపానుగా మారితే భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు వరికోతలపై సంశయంలో ఉన్నారు. ఈనెలాఖరులతో కూడా మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని చెబుతున్నారు. 27, 28 తేదీల్లో అల్పపీడనం వున్నదని వాతావరణ శాఖ హెచ్చరిక చేసినందున ముందస్తు చర్యగా రైతులకు టార్పాలిన్‌లు రైతుసేవా కేంద్రంలో అందుబాటులో వుంచుతామని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రకటించారు. తేమ శాతం, రవాణా ఖర్చులు, గోనె సంచులు సరఫరా, బ్యాంకు ఖాతాలు పక్కాగా చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

అన్నదాత సుఖీభవను కౌల్దార్లకు వర్తింపజేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మొంథా తుపాను వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, సిసిఐ కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం పేరుతో రైతుల పత్తిని కొనకుండా తిరస్కరించడం సరికాదని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు పత్తిని కొనాలని కోరారు. రైతుమిత్ర గ్రూప్‌ల ద్వారా కౌలురైతులకు వ్యక్తిగత రుణాలివ్వాలని, రుణాల మంజూరులో రిజర్వ్ బ్యాంకు నిబంధనలు అమలు చేయాలని కోరారు. సమావేశంలో కౌలురైతు సంఘం నాయకులు పి.కృష్ణ, వై.నాగేశ్వరరావు, ఎన్.నిలాంబరం పాల్గొన్నారు.

పాఠశాల పరిరక్షణ, అభివృద్ధి కోసం అభివృద్ధి కమిటీ కృషి

భవిష్యత్ కార్యాచరణపై యడ్లపాడు లూథరన్ హైస్కూలులో గ్రామస్తులు, పూర్వ విద్యార్థులతో సమావేశం





ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడు లూథరన్ హైస్కూల్ ప్రాంగణంలో పాఠశాలకు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. పాఠశాల దాతల వారసులు, అభివృద్ధి కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు, ప్రజలు హాజరయ్యారు. సమావేశానికి అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు ముత్తవరపు రామారావు అధ్యక్షత వహించి మాట్లాడారు. 1952లో పాఠశాల నిర్మాణానికి శ్రీకారం జరిగిందని, 1956లో ఎఇఎల్‌సికి నిర్వహణ బాధ్యత మాత్రమే అప్పగిస్తున్నట్లు లిఖితపూర్వకంగా ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. తొలుత పాఠశాలను బాగానే నిర్వహించిన ఎఇఎల్‌సి 20 ఏళ్లుగా పూర్తిగా విస్మరించిందని, దీంతో శిథిలావస్థకు చేరిన పాఠశాలను అభివృద్ధి చేసేందుకే కమిటీని ఏర్పాటు చేసుకున్నామని వివరించారు. 2011లో ఎఇఎల్‌సిని కలిసి పాఠశాలలో నెలకొన్న సమస్యలను కమిటీ తెలిసిందని, పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టాలని కోరినా వారు స్పందించలేదన్నారు. ప్రస్తుతం పర్సన్ ఇన్చార్జిలమని వచ్చిన వారితోనూ కమిటీ చర్చించినా స్పందించకపోగా అసత్య ఆరోపణలకు పూనుకోవడం దారుణమని అన్నారు. స్కూల్ ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆరోపిస్తున్న సంఘం ప్రతినిధులు గతంలో ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. ఐదేళ్ల నుండి పాఠశాలలో విద్యార్థులు చేరకపోవడానికి కారణం ఎఇఎల్‌సి నిర్లక్ష్యమేనన్నారు. పాఠశాల మూతపడిన దీనిని ప్రభుత్వానికి అప్పగించి ఐటిఐ, లేదా ఉన్నత విద్య, నైపుణ్యాల శిక్షణ వంటి విద్యా కేంద్రంగా మార్చేందుకు అభివృద్ధి కమిటీ కృషి చేస్తోందని, కలెక్టర్‌కు లిఖితపూర్వంగా ఈ విషయాన్ని వివరించామని తెలిపారు. ఈ అంశంలో ఎమ్మెల్యే పుల్లారావు చొరవ తీసుకోవాలని కోరారు. కమిటీ ఛైర్మన్ నూతలపాటి కాళిదాసు మాట్లాడుతూ యడ్లపాడు గ్రామ ప్రజలు చైతన్యవంతులని, ప్రతి సమస్యను సమన్వయంతో పరిష్కరించుకునే విజ్ఞత వీరికుందని చెప్పారు. అభివృద్ధి కమిటీని, గ్రామ పెద్దలను కించపరిచేలా, పాస్టర్లను రెచ్చగొట్టేలా ఎఇఎల్‌సి మాట్లాడ్డం దారుణమన్నారు. ఇక్కడ విద్యా క్షేత్రాన్ని నెలకొల్పడానికి గ్రామస్తులంతా పార్టీలకు వర్గాలకు అతీతంగా కలిసి రావాలని కోరారు. పాఠశాల పూర్వ విద్యార్థి, అభివృద్ధి కమిటీ సభ్యులు ఎడ్ల సునీల్ మాట్లాడుతూ పాఠశాలకు చెందిన పొలాన్ని దున్నేందుకు కొందరు ట్రాక్టర్‌పై రాగా పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు అడ్డుకున్నారని చెప్పారు. పాఠశాలకు ఎఇఎల్‌సి సంస్థకు సంబంధం లేదన్నారు. సమావేశంలో చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, డాక్టర్ పోపూరి రమేష్, దాసరి వరహాలు, బెజ్జం రాజశేఖర్, పోపూరి వెంకయ్య, కారుచోల రోశయ్య, డి.సూర్య ప్రకాష్ రావు మాట్లాడారు. చెరుకూరి సృజన, డాక్టర్ పోపూరి రమేష్, భయ్యా రాఘవయ్య, జరుగుల శంకర్రావు, కాసు రామస్వామిరెడ్డి, తవ్వ వెంకట నర్సు పాల్గొన్నారు.

మేమూ సహకరిస్తాం : మైనార్టీ కమిషన్ ఛైర్మన్

లూథరన్ పాఠశాల భవిష్యత్ కార్యాచరణ ప్రక్రియ న్యాయస్థానం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల ఆధారంగా కొనసాగుతుందని రాష్ట్ర మైనార్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ జాషువా డానియల్ అన్నారు. పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన విద్యాశాఖ, రెవెన్యూ అధికారులతో మాట్లాడి పాఠశాల వివరాలను గురించి తెలుసుకున్నారు. పాఠశాల భవనం, ఆటస్థలంలో, వెనుక వైపు ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించారు. పాఠశాల తిరిగి పూర్వవైభవం



తెచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఆలోచించాలన్నారు. తాను కూడా లూథరన్ పాఠశాల విద్యార్థినని, పాఠశాల అభ్యున్నతికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. పాఠశాలలో విద్యార్థులను చేరిస్తేనే న్యాయపరంగా ఏమైనా చేయగలమన్నారు. కమిషన్ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి జస్టిస్, ఎఇఎల్‌సి అడ్మినిస్ట్రేటర్ జోసఫ్ పిఎస్, ఎఇఎల్‌సి సెక్రటరీ కంట్రోల్ కె.రత్నకుమార్, పల్నాడు జిల్లా డిఇఒ ఎల్ చంద్రకళ, స్కూల్ ఎడ్యుకేషన్ జిల్లా ఎడి ఉదయ్ భాస్కర్, నరసరావుపేట డిప్యూటీ డిఈఓ ఎస్‌ఎం సుభాని, తహశీల్దార్ జెట్టి విజయశ్రీ, సర్వేయర్ గేరా సురేంద్రనాథ్, డిప్యూటీ పాఠశాల హెచ్‌ఎం బిఎస్ పద్మలత పాల్గొన్నారు.

ధాన్యం కొన్న ఆరు గంటల్లో నగదు

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకోసం 6.54 కోట్ల గోతాలు సరఫరా చేశామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 209 రైతు సేవ కేంద్రాల పరిధిలో 47 కస్టర్ల ద్వారా గురువారం నుండి ధాన్యం కొనుగోలు చేపట్టినట్లు తెలిపారు. రైతులు ప్రస్తుతం వారికి నచ్చిన రైస్ మిల్లర్లుకు ధాన్యం అమ్ముకోవచ్చని, కొనుగోలు కేంద్రంలో ఏ కంపెనీ మిషన్‌ల ద్వారా అయితే తేమ శాతాన్ని పరిశీలించారో అదే కంపెనీ మిషన్‌ల ద్వారా రైస్ మిల్లర్లు వద్ద కూడా ఉంచి పరిశీలిస్తారని, దీనిద్వారా తేమశాతం వ్యత్యాసాలకు వీలుండదని అన్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల్లోపు ధాన్యం అమ్మితే సాయంత్రం 6 గంటల్లోపే నగదు జమయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నామని, బ్యాంకు సెలవు దినాలు మినహా అన్ని రోజుల్లో సాయంత్రం 4 గంటల్లోపు నగదు జమవుతుందని వివరించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 2.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 4 గంటల్లోపే రూ.680 కోట్ల నగదు జమ చేశామని తెలిపారు. ధాన్యం కొనుగోలులో అవినీతిని సహించబోమన్నారు. పంటలు తడవకుండా కాపాడుకునేందుకు జిల్లాలోని ప్రతి రైతు సేవా కేంద్రంలో సుమారు 50 వేల టార్పాలిన్ పట్టాలు అందుబాటులో ఉంటాయన్నారు. మొంథా తుపాను వల్ల పంట నష్టపోయిన రైతుల్ని ఆదుకుంటామని, ఇప్పటికే వివరాలు తీసుకున్నామని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు



సమయంలో రైతులకు ఇబ్బందులు ఎదురైతే దగ్గర్లోని రైతుసేవ కేంద్రాల్లో అధికారుల దృష్టికి తేవాలని, లేదా కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఇదిలా ఉండగా మంత్రి మనోహర్ తెనాలి మండలం సోమసుందరపాలెం, తెనాలి పట్టణం ఐతానగర్‌లో పర్యటించారు. రైతులతో మాట్లాడి వారికి అవసరమైన టార్పాలిన్ పట్టాలను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. తాడేపల్లి మండలం ప్రాతూరు, చిర్రావూరు గ్రామాల్లో రైతుసేవ కేంద్రాలను పరిశీలించారు. చిర్రావూరులో రైతుల సమావేశంలో మాట్లాడారు. 20369, 20389 రకం దాన్యాన్నీ కొంటామన్నారు. ఆయా కార్యక్రమాల్లో జెసి అశుతోష్ శ్రీవాత్సవ, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సిన్హా, డిసిఎంఎస్ డీఎం హరిగోపాల్‌రెడ్డి, డిఎస్‌ఒ పి.కోమలి పద్మ, డిఎం తులసి కొల్లిపర, తెనాలి, తాడేపల్లి తహశీల్దార్‌లు సిద్ధార్థ, కెవి గోపాలకృష్ణ, డి.సీతారామయ్య, ఏవోలు శ్రీనివాస్‌రెడ్డి, సుధీర్‌బాబు, జనసేన నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, ఎస్.నాగేశ్వరరావు, ఎస్.విజయసాగర్, ఎ.కాళీకృష్ణ పాల్గొన్నారు.



జీఎస్టీపై విజె డిగ్రీ విద్యార్థులు అవగాహన

ప్రజాశక్తి - మంగళగిరి : విజె డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆత్మకూరు గ్రామంలో నిర్వహిస్తున్న జాతీయ సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఆరో రోజున పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా జీఎస్టీ, ఆర్థిక అభివృద్ధిలో జీఎస్టీ పాత్ర వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని తనిఖీ చేసిన రాష్ట్ర ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ సుధాకర్ మాట్లాడారు. ప్రకృతి పరిరక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ప్రకృతి తల్లితో సమానమని, గాలి, నీరు, చెట్లు, వాతావరణం మనిషి జీవనానికి ఆధారమని చెప్పారు. ప్రతి పౌరుడు వీటిని కాపాడుకోవడం బాధ్యతగా భావించాలని కోరారు. కళాశాల కరస్పాండెంట్-సెక్రటరీ ప్రెగడ రాజశేఖర్ మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ నాదెళ్ల శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ గంజి లక్ష్మీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ శిఖ శంకర్, గోచిపాత సురేష్, అధ్యాపక బృందం, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్



మండలంలోని కురగల్లు గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందగా గురువారం పోలీసులు ప్రమాద నివారణ చర్యలు చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా మంగళగిరి రూరల్ సీఐ ఎవి.బ్రహ్మం, ఎస్ఐ వెంకట్ కలిసి రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా గ్రామ రోడ్డు వైపుల గుంతలను, కంపచెట్లను డోజర్ సహాయంతో క్లీన్ చేయించారు. రోడ్డుపై ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు బహూకరణ

ప్రజాశక్తి - చేబ్రోలు : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల టికె వేజెండ్ల లో మధ్యాహ్న భోజనము కొరతగా ఉన్న భోజనం ప్లేట్లను ఇదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు పి.దీప్తి తన సొంత ఖర్చులతో అందింకారు. పాఠశాల తనిఖీలో భాగంగా మండల విద్యాశాఖ అధికారి ఆర్.సుబ్బారావు గురువారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్లేట్లను ఆయన ద్వారా అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిఆర్‌పి సంపూర్ణమ్మ పాల్గొన్నారు.

మోటారు వాహన చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని

ప్రజాశక్తి- తాడేపల్లి

కార్మికులకు ఉరితాడుగా మారిన దుర్మార్గమైన మోటారు వాహన చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. గురువారం తాడేపల్లి పట్టణంలోని వివిధ ఆటో స్టాండ్ లో తాడేపల్లిలో జరగ నున్న సిఐటియు గుంటూరు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఆయన మాట్లాడారు. అర్హులైన ఆటోడ్రైవర్లకు అందరికీ 15 వేల రూపాయలు ఇవ్వాలని, ఆటో డ్రైవర్లకు మెడకు ఉరితాడు లాంటి మోటారు వాహన చట్టాన్ని ఆటో డ్రైవర్ల అందరూ వ్యతిరేకించాలని కోరారు. ఈనెల 23వ తేదీన తాడేపల్లి పట్టణంలో బోసు బమ్మ సెంటర్ నుండి సాయంత్రం నాలుగు గంటలకు జరిగే కార్మిక ప్రదర్శనలో ఆటో కార్మిక కుటుంబాలందరూ పాల్గనాలని,ప్రతి ఆటోకి జెండా కట్టుకొని ఊరేగింపులో రావాలని ఆయన ఆటో డ్రైవర్లు కోరారు.ఈ కార్యక్రమంలో కఅష్ణ, చిన్నారావు,స్వామి, రాజు, భాష,బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేముల దుర్గారావు

పారిశుధ్య పనులను పరిశీలించిన సిఇఒ



ప్రజాశక్తి - చేబ్రోలు

గురువారం మండలంలోని నారాకోడూరు గ్రామాన్ని జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి వి జ్యోతి బస్సు సందర్శించ్చారు. ఆయన గ్రామంలో తిరిగి పారిశుధ్య నిర్వ హణకు సంబంధించిన అంశాలను పరిశీలిం చారని మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి ఊహారాణి తెలిపారు. ఇంటి వ్యర్థపు నీటి నిర్వహణ సౌకర్యాలను పరిశీలించిన సి ఈ వో మురుగుపారుదల నిర్వహణ పనులు మరియు ఇంకుడు గుంటల ఆవశ్యకత గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు .అలాగే ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించిన తరువాత చెత్త నుండి సంపద తయారీ కేంద్రమును సందర్శించారు . సంపద తయారీ కోసం ఎస్ డబ్ల్యూ పిసి షెడ్ దగ్గర మరింత సమర్ధవంతంగా చేయవలసిన విధానాల ఏర్పాట్ల గురించి పంచాయితీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామ సచివాలయ పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి వెలగా సాంబశివరావు , ఎంపీడీవో టి ఊహారాణి, డిప్యూటీ ఎంపీడీవో ఎం రవిశంకర్ , ఎం సి ఓ ఎస్ బి ఎం ప్రసాద్ జి , పంచాయతీ కార్యదర్శి రవితేజ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కేఎల్ రావు కాలనీ వాసులకు స్థలం, నష్టపరిహారం అందజేత

అసంతప్తి వ్యక్తం చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని కేఎల్ రావు కాలనీలో రాజధానికి అనుసంధానంగా నిర్మిస్తున్న సీడ్ యాక్సిస్ రోడ్ లో భాగంగా నిర్మిస్తున్న స్టీల్ బ్రిడ్జి కోసం ఇల్లు కోల్పోతున్న 86 మంది బాధితులకు గురువారం రాత్రి తాడేపల్లి మున్సిపల్ జోనల్ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. కృష్ణ నగర్ డ్రైవర్ కాలనీలో 49 మందికి, ఆత్మకూరు జగనన్న కాలనీ వద్ద 37మందికి లాటరీ పద్ధతిలో ప్లాట్లు కేటాయించారు. ప్రభుత్వం అందజేసిన నష్టపరిహారం విషయంలో బాధితులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 4 గదులు రేకుల షెడ్డు ఉన్న ఇంటికి రూ 4 లక్షలు, రెండు గదులు ఉన్న ఇంటికి 2 లక్షలు, అంతే స్థాయిలో రెండు గదులు ఉన్న మరో ఇంటికి రూ1.30 లక్షలు ఇవ్వడంతో తమకు సరిగా న్యాయం జరగలేదని పేదలు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం ఇచ్చే రూ 2 లక్షలు, రూ 4 లక్షలు, రూ1.30 లక్షలతో ఇల్లు ఎలా నిర్మించుకోగలమని ఆ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బి సునీత అనే బాధితురాలు ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం తమకు చాలదని, సొంత ఇంటి కల తమకు కలగానే మిగిలిపోతుందని వాపోయారు. తమకు నష్టపరిహారం సరిగా అందలేదని అధికారులను ప్రశ్నించారు. ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎం టి ఎం సి కమిషనర్ ఎస్ కే ఆలిం భాష, టిడిపి నాయకులు ముమ్మిడి సత్యనారాయణ, వల్లభనేని వెంకటరావు, సిపిఎం నాయకులు డివి భాస్కర్ రెడ్డి, కే రామకృష్ణ పాల్గొన్నారు.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS (0/0 DISTRICT REGISTRAR) AT GUNTUR, GUNTUR DISTRICT
DISPUTE No. 46/2024

Between:
M/s. Shriram Chits (India) Private Limited., Tenali Branch, Rep by It's: Legal Manager cum GPA Holder ..... Disputant
And
Akkala Sridevi and others ...Opponents
OP1. Akkala Sridevi,W/o Lakshmi Satyanarayana, Hindu, aged 48 Years, Busness, and R/o D. No.7-36-25, Ganganamma Peta,Akkala vari street, main Road, Tenali, Guntur District.
OP2. Akkala Lakshmi Satyanarayana, S/o Hanumantha rao, Hindu, aged, 54 Years, Employee W/as SGT Teacher, M.P.P.S, Mallipadu Tenali, Guntur (DT), and R/o R/o D. No.7-36-25, Ganganamma Peta, Akkala vari street, main Road, Tenali, Guntur District.

Whereas the Plaintiff/disputant has instituted a claim or dispute against you for recovery of an amount of Rs.54,900/- you are hereby Summoned to appear to this court in person or pleader on the 09-12-2025 at O/o District Registrar, Guntur, 10.30 AM. in the Morning, to answer the claim; and you are directed to produce on that day all the documents upon which you intend to relay in support of your defense.
Take notice that, in default of your appearance on the day before mentioned, the claim will be heard and determined in your absence.
Given under my hand and seal of the Court, this 28th day of October -2025.
DEPUTY REGISTRAR OF CHITS, GUNTUR

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS (0/0 DISTRICT REGISTRAR) AT GUNTUR, GUNTUR DISTRICT
DISPUTE No. 45/2024

Between:
M/s. Shriram Chits (India) Private Limited., Tenali Branch, Rep by it's: Legal Manager cum GPA Holder ..... Disputant
And
Akkala Sridevi and others ...Opponents
OP1.Akkala Sridevi,W/o Lakshmi Satyanarayana, Hindu, aged 48 Years, Busness, and R/o D. No.7-36-25, Ganganamma Peta,Akkala vari street, main Road, Tenali, Guntur District.
OP2. Akkala Lakshmi Satyanarayana, S/o Hanumantha rao, Hindu, aged, 54 Years, Employee W/as SGT Teacher, M.P.P.S, Mallipadu Tenali, Guntur (DT), and R/o R/o D. No.7-36-25, Ganganamma Peta, Akkala vari street, main Road, Tenali, Guntur District.

Whereas the Plaintiff/disputant has instituted a claim or dispute against you for recovery of an amount of Rs. 3,45,261/- you are hereby Summoned to appear to this court in person or pleader on the 09-12-2025 at O/o District Registrar, Guntur, 10.30 AM. in the Morning, to answer the claim; and you are directed to produce on that day all the documents upon which you intend to relay in support of your defense.
Take notice that, in default of your appearance on the day before mentioned, the claim will be heard and determined in your absence.
Given under my hand and seal of the Court, this 28th day of October -2025.
DEPUTY REGISTRAR OF CHITS, GUNTUR

దావా సమన్లు
మహారాజశ్రీ గుంటూరు 3వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఒ.యస్.నెం.13/2025

బిట్వీన్ :
పటేల్లా వెంకట నాగేశ్వరరావు (Pathella Venkata Nageswara Rao) ...వాది
మరియు
గోగన జవహర్ బాబు వగైరాలు ... ప్రతివాదులు
టు,
D-1: గోగన జవహర్ బాబు, తండ్రి. సూర్యనారాయణ, పోస్టల్ కాలనీ 3వలైను, గుంటూరు.

పై నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు సమన్లు పంపించినను మీకు ముట్టనందున ఈ పేపరు ప్రకటన ద్వారా సమన్లు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది. 17-12-2025కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు ఉ.గం. 10-30ని.లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయంగా కాని లేదా మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్ష మందు విచారించి తీర్మానించ బడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది. 17-12-2025

కె.ఎ.విల్సన్,
వాది తరపు అడ్వకేట్,
2/3 బ్రాడీపేట, గుంటూరు

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టులో
E.P. No.110/2023 in O.S. No. 292/2020

వాసిరెడ్డి వేణుగోపాలరావు ... పిటీషనర్ /D.Hr/ వాది
మరియు
రామిశెట్టి లక్ష్మి మరియు ఇరువురు
... రెస్పాండెంట్లు /J.Dr.s/ ప్రతివాదులు
టు,
1) రామిశెట్టి లక్ష్మి W/o లేటు బొల్లయ్య
2) రామిశెట్టి తేజ D/o లేటు బొల్లయ్య
3) రామిశెట్టి ధరణి D/o లేటు బొల్లయ్య
ఫ్లాట్ నెం.502, శ్రీనివాస టవర్స్, ప్రకాష్‌నగర్, నరసరావుపేట పోస్ట్, పల్నాడుజిల్లా.

O.S. No. 292/2020 లో పై కోర్టువారు ఇచ్చిన డిక్రీ మొత్తము వసూలు నిమిత్తం పై నెంబరు ఇ.పి.ని D.Hr దాఖలు చేయగా మీరు కోర్టువారి నోటీసులు తీసుకొనని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా మీ యొక్క నోటీసు నిమిత్తం ది. 27-11-2025కి వాయిదా అయివున్నది. కావున వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన గలరు. లేనియెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమందు తీర్మానించ బడును.

(By Court Order)
వాయిదాతేది : 27-11-2025

శ్రీ ఎం.ఎన్.ప్రసాద్,
కె.హైమానందరావు,
న్యాయవాదులు, నరసరావుపేట.
మొబైల్ నెం. 94402 49130

జనరల్ నోటీస్
IN THE COURT OF THE HON□BLE ADDL. SENIOR CIVIL JUDGE :: TENALI (SENIOR DIVISION)
CREDITOR-I.P.No. 65/2025

Between :-
GUNDU SIVA NAGENDRARAO ... Petitioner
Vs
R1: BOMMISETTY SURESH BABU
R2 :BOMMISETTY JAYA LAKSHMI ..... Respondents

పై నెంబరు గల ఐ.పి.లో పిటిషనర్‌ను తనను ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ పిటిషన్‌ను దాఖలు చేయగా సదరు పిటిషన్‌పై ఎవరికైనా అభ్యంతరాలు వుంటే తెలుపుకోమని శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసుకు ఆర్డరు వేస్తూ మీ హాజరు నిమిత్తము ది. 26-11-2025వ తేదీకి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం గం.10-30 ని॥ లకు మీరు స్వయముగా గానీ, మీ తరపున న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టు వారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించ బడునని యావన్మందికి తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదా తేది : 26-11-2025

ఇట్లు
ఆవుల భాను ప్రకాష్ ,
తాడిశెట్టి వెంకటేశ్వరరావు,
అడ్వకేట్స్ తెనాలి
సెల్ :7013601119, 9703526999.

మహారాజశ్రీ అడిషనల్ సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్) నరసరావుపేట గారి కోర్టులో
I.P. No. 37/2024

Between :-
గాలం ఆదినారాయణ .... పిటీషనరు
వర్సెస్
వీరగంధం సత్యనారాయణ అండ్ అదర్స్
... రెస్పాండెంట్స్
To,
R2 : షేక్ మహమ్మద్ అలీ S/o అబ్దుల్ అజీజ్, డోర్ నెం. 5940, సంతగుడిపాడు గ్రామం, రొంపిచర్ల మండలం, పల్నాడుజిల్లా, సెల్ : 9553843796

సదరు పై నెం. పిటీషన్‌లో పిటీషనర్ ఇన్‌సాల్వెన్సీ పిటీషన్ దాఖలు చేయగా సదరు పిటీషన్‌లో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున చివరిసారిగా పేపరు ప్రకటన ద్వారా నోటీసులు పంపించమని శ్రీ కోర్టువారు ఆర్డరు వేసినారు. కావున ది. 11-12-2025న ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేనిచో మీకు పరోక్షంగా తీర్పు చెప్పబడను.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)
వాయిదా తేది : 11-12-2025

ఇట్లు
మామిళ్ళపల్లి శ్రీనివాసరావు,
షేక్ అఫీజున్నీసా,
ఎ.అనిల్‌కుమార్,
అడ్వకేట్స్, నరసరావుపేట.
సెల్ : 8919666601, 89192 80192

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, బాపట్ల.
I.A.No. 292/2025
In
O.S.No.248/2025.

Between:
Suragani Ramesh,S/o Mallaiah, age,59 years, R/o Dno:15-8-64. BesthaPalam Bapatla, Bapatla district ...... Plaintiff.
and.
Puppala Rajendra Prasad S/o Koteswara Rao, age 42 years, R/026-38-113, 2nd line, Hanuman Nagar, A.T. Agraharam, Guntur, Guntur district ....Defendant..

పై నెంబరు దావా లో వాది ప్రామిసరీ నోటు దావాను ప్రతివాదిపై దాఖలు చేసి, సదరు దావాలో ప్రతివాది తాలూకు స్థిరాస్తిని జప్తు కోరుచూ I.A.No. 292/2025గా పిటీషన్ దాఖలు చేసి యున్నంతలో శ్రీకోర్టు వారు షరతులతో కూడిన షెడ్యూలు స్థిరాస్తి జప్తు ఉత్తరువులు 06-08-2025 తేదీన ఇచ్చి ఉన్నారు. సదరు విషయమై ప్రతివాదికి దావా సమను,/ పిటిషన్ నోటీసు శ్రీకోర్టు వారు పంపించి ఉన్నంతలో సదరు ప్రతివాది/రెస్పాండెంట్ ఎక్కడ ఉన్నారో తెలియదు అని సదరు సమను/ నోటీసు తిరిగి శ్రీకోర్టుకి వచ్చి ఉన్నంతలో ప్రతివాదికి పేపర్ ప్రకటన ద్వారా మాత్రమే సదరు దావా సమను/ పిటిషన్ నోటీసు జారీ చేయవలసినదిగా శ్రీకోర్టు వారు ఉత్తర్వులు మంజూరు చేసి 26-11-2025 తేదీకి వాయిదా వేసియున్నారు.. కావున పైతెలిపిన దావా/ పిటిషనులో మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల పై తెలిపిన తేదీన ఉదయం 10:30 గంట లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గానీ వకీలు ద్వారాగానీ హాజరై మీయొక్క ఆక్షేపణలు తెలుపగలరు. లేనిచో సదరు దావాను/పిటీషన్‌ను మీ పరోక్షంలో తీర్మానం చేసెదరు అని ఇందుములముగా తెలియచేయడమైనది.

//శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//
వాయిదా తేదీ : 26-11-2025.

ఇట్లు
ఎస్.రవీంద్రబాబు
వాది తరుపు న్యాయవాది, బాపట్ల,
సెల్ : 9440110161.

మహారాజశ్రీ చిలకలూరిపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఐ.ఎ. నెం. 1229/2025
And
ఐ.ఎ. నెం. 1230/2025
ఇన్
ఓ.యస్. నెం. 13/2025

గణేశుని కోటేశ్వరరావు ...పిటీషనర్
ఎదిరి
గణేశుని హరిబాబు .. రెస్పాండెంట్
రెస్పాండెంట్ :
గణేశుని హరిబాబు, తండ్రి వెంకటేశ్వర్లు, హిందు, వయస్సు 45 సం॥ లు, నివాసం. విశ్వ బ్రాహ్మిణ్ కాలనీ, పెదనందిపాడు రోడ్డు, చిలకలూరిపేట, పల్నాడుజిల్లా.

చిలకలూరిపేట ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు గల ఫైనల్ డిక్రీ పిటీషన్లో శ్రీ కోర్టువారు మీకు నోటీసులు ఎన్ని పర్యాయములు పంపినను తీసుకోకుండా కావాలని కాలయాపన చేయుచున్నారని తెలుపగా పేపరు ప్రకటన ద్వారా నోటీసు పంపవలసినదిగా సూచన చేసివున్నారు. సదరు ఆర్డరు ప్రకారం ది. 05-12-2025 ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టువారి ముందు వాయిదాకు హాజరై మీ అక్షేపణలు తెలుపుకో వలసినది. లేనిచో మీ పరోక్షమున పిటీషన్ తీర్మానించ బడునని తెలియజేయడమైనది.

శ్రీ కోర్టువారి ఆదేశానుసారం

డి.వి.నాగరాజు
పిటిషనర్ తరఫు న్యాయవాది.
తేదీ:21-11-2025 **చిలకలూరిపేట.**
స్థలం: చిలకలూరిపేట **సెల్ : 9849361677**

మహారాజశ్రీ
మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఐ.ఎ.నెం.1428/2024
ఇన్
ఓ.ఎస్.నెం.276/2024

పులుకూరి వెలుగొండయ్య.... పిటీషనర్స్/ప్లైయింటిప్
వర్సెస్
కండే మహేశ్వరి.......... రెస్పాండెంట్స్/డిఫెండెంట్
టు,
గర్రె రామారావు, తండ్రి: లక్ష్మయ్య, హిందూ, వ్యాపారం, డోర్ నెం: 4-9, కారంపూడి గ్రామం, కారంపూడి మండలం, పల్నాడు జిల్లా. (పాత గుంటూరు జిల్లా)
ప్రపోజ్డ్ రెస్పాండెంట్ నెం: 1.

పై నెంబరు దావాలోని షెడ్యూలు ఆస్థిపై పిటీషనర్లుకు హక్కు గలదని ఈకేసులో పార్టీలుగా చేర్చమని అండర్ ఆర్డర్ 1 రూల్ 10 సి.పి.సి పిటీషన్‌ను దాఖలు చేసినందున ఇందు విషయమై నీకు పలుమార్లు నోటీసులు పంపగా అవి నీకు ముట్టని కారణం చేత ఈ పేపరు నోటీసు ద్వారా నీకు తెలియజేయునది ఏమనగా 01-12-2025వ తేదీన వాయిదా ఉన్నది. ఆ రోజు ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో నీవు స్వయముగా గానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరై నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకొనవలసినది. లేని యెడల ఐ.ఎ. నెం. 1428/2024 పిటీషన్‌ను నీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వులతో //
వాయిదా: 01-12-2025
మార్కాపురం **గెల్లి చౌడేశ్వరరావు,**
అడ్వకేట్, మార్కాపురం
సెల్: 9985009542.





రెంటచింతలలో పల్నాడు చిత్రీకరణ

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో 'పల్నాడు' చిత్రబృందం సందడి చేసింది. చందా గోవిందురెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హీరో హీరోయిన్లుగా రోహిత్ వర్మ, రియా సుమన్ నటిస్తు నిఖిల్ దేవాదుల, అక్షర నటిస్తున్నారు. వీరిపై పాటకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఈ పాఠశాలలో చిత్రీకరించారు. కొరియోగ్రాఫర్ ఈశ్వర్, డిఓపి ఎ.రవి కుమార్, ఎడిటర్ చోటా కె ప్రసాద్ అని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రంలోని సన్నివేశాలను పల్నాడు పరిసర ప్రాంతాలు, నాగార్జున సాగర్‌లోనూ చిత్రీకరించినట్లు చెప్పారు.



ఎమ్మెల్యే ప్రజాదర్బార్‌కు 56 అర్జీలు

ప్రజాశక్తి - వెల్దుర్తి

మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్పష్టం గురువారం స్థానిక తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలపై 56 అర్జీలు రాగా వీటిల్లో ఎక్కువగా భూ, స్థల వివాదాలకు సంబంధించినవే ఉన్నాయి. పింఛన్లు, రోడ్డు ఆక్రమించి బెదిరించడంపైనా అర్జీలొచ్చాయి. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఫణిదం జెడ్‌పి విద్యార్థులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీలకు సత్తెనపల్లి మండలం ఫణిదం జెడ్‌పి పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం అడపా పద్మలత గురువారం తెలిపారు. గత బుధవారం మేడికొండూరు మండలం కొర్రపాడు హైస్కూల్‌లో జరిగిన బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపికల్లో అండర్ -14 విభాగంలో కె.గుణశేఖర్, అండర్-17 విభాగంలో ఎం.మహీధర్ ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 3న పెదకాకాని మండలం వెనిగండ్లలో జరిగిన రగ్బీ జిల్లా జట్ల ఎంపికలలో అండర్-17 విభాగంలో ఆర్.వెంకటేష్, నవంబర్ 10న నందిగామలో జరిగిన హాకీ అండర్-19 విభాగంలో షేక్.రియాజ్, ఎం.నీరజ్ ఎంపికైనట్లు వివరించారు. వీరు ఈ నెలలో విశాఖపట్నం, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో జరిగే 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పిఇటి ఎల్.పిచ్చయ్య తెలిపారు.

అర్ధాకలితోనే ధర్నా చేస్తున్నాం

- **భవన నిర్మాణ కార్మికుల ఆవేదన**
- **సంక్షేమ బోర్డు ద్వారా పథకాల పునరుద్ధరణకు డిమాండ్**
- **పల్నాడు కలెక్టరేట్ ఎదుట ర్యాలీ, ధర్నా అనంతరం డిఆర్‌ఒకు వినతి**



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తాము కాలక్షేపం కోసం ధర్నాలు చేయడం లేదని అర్ధాకలితో కడుపు మండి ధర్నా చేస్తున్నామని భవన నిర్మాణ కార్మికులు ఆవేదనకు గురయ్యారు. భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు గురువారం నరసరావుపేటలోని ధర్నా చౌక్ వద్ద ధర్నా, అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల భవన నిర్మాణ కార్మికులకు లబ్ధి కలిగించే సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని, ఇందుకు అడ్డంకిగా ఉన్న మెమో 1214ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు అమలు కాక పల్నాడు జిల్లాలో వెయ్యి మందికి పైగా కార్మిక కుటుంబాలకు అందాల్సిన రూ.9 కోట్ల క్లైమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సంక్షేమ పథకాల విషయమై కార్మిక శాఖ మంత్రిని సంఘం రాష్ట్ర నాయకులు కలిసిన సందర్భంలో మీ ఓట్లతో గెలిచాం, మీరు లేకుంటే కూటమి ప్రభుత్వం లేదంటూ పొగడ్తలు మినహా ప్రయోజనం లేదన్నారు. చనిపోయిన కార్మికులకు, వివాహం, ప్రసవం తదితర సందర్భాల్లో సంక్షేమ బోర్డు ద్వారా ఇతరరాష్ట్రాల్లో అమలు చేస్తున్నట్లు ఏపిలో కూడా పథకాలు అమలు చేయాలన్నారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలు కొత్త పథకాలనూ ప్రారంభించాయని, రూ.5 లక్షలుగా ఉన్న ప్రమాదం భీమాను రూ.10 లక్షలకు పెంచాయని తెలిపారు. పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, కుటుంబాలకు ఆరోగ్య పరీక్షలు వంటి సదుపాయాలు కల్పిస్తున్నాయన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అవ్వారు ప్రసాదరావు, అధ్యక్షులు కోట ఆంజనేయులు, సహాయ కార్యదర్శి అంగలకుదురు ఆంజనేయులు, కోశాధికారి ఆంజనేయులు, కార్మికులు బత్తుల బాలకోటయ్య, కె.సురేష్, తులసిరావు, శ్రీను, వెంకటప్పయ్య, కొండలు, చిన్న యేసు, సాల్మన్ రాజు పాల్గొన్నారు.



ఉక్కు కార్మికుల పట్ల సిఎం వ్యాఖ్యలపై వామపక్షాల నిరసన

ప్రజాశక్తి - మాచర్ల

విశాఖ ఉక్కు కర్మాగారం నష్టాల్లో నడుస్తోందని, దానికి కార్మికులే కారణమంటూ సిఎం చంద్రబాబు వాఖ్యానించడాన్ని వామపక్ష పార్టీలు ఖండించాయి. స్థానిక సిపిఐ కార్యాలయం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టి అనంతరం తహశీల్దార్ బి.కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, ఏరియా సెక్రటరీ మేకపోతుల శ్రీనివాసరెడ్డి, సిపిఎం కార్యదర్శి బండ్ల మహేష్, ఎంసిపిఐ నాయకులు అబ్రహం లింకన్ మాట్లాడుతూ 32 మంది విద్యార్థుల ప్రాణ త్యాగాల ఫలితంగా విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సాధించుకున్నట్టు గుర్తు చేశారు. ఆంధ్రుల హక్కుగా ఉన్న కర్మాగారాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నాయన్నారు. కర్మాగారాన్ని సాధించుకునేందుకు ఆనాడు సిపిఐ, సిపిఎం ఎమ్మెల్యేలు 66 మంది 7గురు ఎంపీలు రాజీనామా చేసిన సంగతిని గుర్తు చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి సముద్ర తీరాన ఉన్న వేల కోట్ల విలువైన 20 వేల ఎకరాల భూమిని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రభుత్వాలు సిద్ధమైనట్లు తెలిపారు. సిఎం చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విశాఖ కర్మాగారాన్ని కార్పొరేట్లకు కట్టబెడితే చూస్తూ ఊరుకునేది లేదని, ఎంతకైనా పోరాడుతామని మాట్లాడి ఇప్పుడు స్వరం మార్చడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఉక్కు కర్మాగారం నష్టాలకు కార్మికులు ఎలా కారణమవుతారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.బాబురావు, కె.రంగనాయకులు, కె.శివయ్య, కె.బ్రహ్మాచారి, వీరబ్రహ్మాచారి, ఎం.చెన్నయోసోబు, కె.కిరణ్, వి.రాము, వెంకట్రావు, దిబ్బయ్య, సిహెచ్.అమరేశ్వరరావు పాల్గొన్నారు.

అదనపు పనులు.. ఎనిమిదేళ్లుగా పెరగని జీతాలు

ప్రజాశక్తి - పెదకూరపాడు



తమ సమస్యల పరిష్కారం కోసం గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్‌ఎలు) స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. వీఆర్‌ఏల సంఘం (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు షేక్ బందగీ సాహెబ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో వీఆర్‌ఏల సమస్య ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని, ఎనిమిదేళ్లుగా జీతాలు పెరగక విఆర్‌ఎలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తెలంగాణలో వీఆర్‌ఏలకు పే స్కేలు అమలు చేస్తుండగా ఇక్కడదేమీ లేదని ఆవేదన వెలిబుచ్చారు. ప్రమోషన్ కోసం ఎదురు చూస్తున్న వారికి వయోభారం పెరుగుతోందనేగాని ఫలితం ఉండడం లేదని, నామినీలను విఆర్‌ఎలుగా నియమించడం లేదని అన్నారు. అటెండర్, నైట్ వాచ్మెన్ ప్రమోషన్ శాతాన్ని 70శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే విజయవాడ కేంద్రంగా ధర్నాలకు సిద్ధమవుతామని చెప్పారు. సంఘం మండల అధ్యక్షులు ఎం.బాజీ మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేస్తామని ఎన్నికల ముందు కూటమి హామీనిచ్చిందని గుర్తు చేశారు. ఖాళీలు భర్తీ చేయకుండా నైట్ వాచ్మెన్, అటెండర్, డ్రైవింగ్ డ్యూటీలు వేస్తున్నారని, వాటిని తక్షణం రద్దు చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న వీఆర్వో, రికార్డ్ అసిస్టెంట్, అటెండర్, నైట్ వాచ్మెన్ పోస్టులను వీఆర్‌ఏలతో భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొండలు, అశోక్, సీతారామరాజు, రామకృష్ణ, అనూష, సుశీల, మౌలాలి, రంజాన్ బి, ఇమాంస పాల్గొన్నారు.




ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరపాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మారేడుమల్లిలో ఈనెల 18న హిడ్మా, అతడి భార్య రాజేశ్వరి మరో నలుగురు, 19న టెక్ శంకర్‌తో సహా ఏడుగురు చొప్పున వరుసగా జరుగుతున్న ఎన్కౌంటర్లు, అరెస్టులపై తక్షణమే న్యాయ విచారణ జరపాలని, ఎన్కౌంటర్‌లు ఆపాలని పిడిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నరసరావుపేటలోని ధర్నా చౌక్ వద్ద గురువారం నిరసన ప్రదర్శన చేపట్టారు. నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షులు షేక్.మస్తాన్వలి, కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో రెండేళ్లలో దేశ వ్యాప్తంగా 720 మందికి పైగా ఆదివాసీలను, మావోయిస్టులను పొట్టన పెట్టుకుందన్నారు. చంపుతామని పాలకులు ప్రకటించడం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమన్నారు. భూములు, గనులు, సముద్రాలను కార్పొరేట్లకు అప్పజెప్పుతూ దాడులకు పాల్పడుతున్న ప్రభుత్వాల తీరుపై మేధావులు మాట్లాడాలన్నారు. ప్రజా ఉద్యమాలు లేకపోతే ప్రజలు బానిసల్లా బతకాల్సి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శిఖినం చిన్న, ఉన్నం రాణి పాల్గొన్నారు.

అంగన్వాడీలకు ఎన్నికల విధులొద్దు

ప్రజాశక్తి-దాచేపల్లి : ఎన్నికల విధుల నుండి అంగన్వాడిలను మినహాయించాలని అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు తహశీల్దార్ శ్రీనివాస్‌కు నాయకులు గురువారం వినతిపత్రం ఇచ్చారు. యూనియన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శాంతమణి, గౌరవాధ్యక్షులు మల్లీశ్వరీ మాట్లాడుతూ అంగన్వాడీలు ఇప్పటికే రకరకాల యాప్‌లతో పనివత్తిడికి గురవుతున్నారని, అంగన్వాడీలు అదనపు డ్యూటీలు చేయకూడదని జీవో ఉన్నా ఎన్నికల డ్యూటీలు వేస్తున్నారని చెప్పారు. సామాజిక పింఛన్లు పంపిణీ నుండి మినహాయింపు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీలు షేక్ హజర, జ్యోతి, శ్రీలక్ష్మీ శివకుమారి, సిఐటియు జిల్లా నాయకులు టి.శ్రీనివాసరావు, హరిపోతురాజు పాల్గొన్నారు.



తాడేపల్లిలో సిఐటియు జిల్లా మహాసభ జయప్రదం చేయండి

విస్తృత ప్రచారంలో నాయకుల పిలుపు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఈనెల 23,24 తేదీల్లో సిఐటియు జిల్లా మహా సభల సందర్భంగా తాడేపల్లి లో జరిగే ప్రదర్శన, బహిరంగ సభకు కార్మికులు కుటుంబాలతో సహా తరలిరావాలని సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి పిలుపునిచ్చారు. గురువారం ఉండవల్లి సచివాలయం వద్ద మున్సిపల్ కార్మికులతో ఆయన మాట్లాడారు. సిఐటియు అండతో రాజధాని ప్రాంతంలో కార్మికులు సంఘటితమై తాము ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించుకోగలి గారని చెప్పారు. సంఘం అండతో కార్మికులపై వేధింపులను అడ్డుకోగలిగారని అన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం జరిగిన మున్సిపల్ కార్మికుల సమ్మెలో సమరశీలంగా నిలిచారని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులు సంఘటితమై పలు ఆందోళనలు చేపట్టడంతో పాటు, సమ్మెను ఉధృతం చేయడం ద్వారానే జీతాలు పెంచుకోగలిగారని వివరించారు. కార్యక్రమంలో సిఐటియు రాజధాని డివిజన్ నాయకులు కే రామకష్ణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆవల నారాయణ, ఏం స్వర్ణ కుమారి, వై సుందర్ రావు,కుశాలరావు, మేరీ, స్వరూప, శ్రావణి ఈశ్వరమ్మ, సుజాత పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు : తాడేపల్లిలో జరిగే సిఐటియు గుంటూరు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు రాజధాని డివిజన్ కో కన్వీనర్ ఎం రవి కోరారు.రాజధాని అమరావతి పరిధిలోని మందడంలో పని విరామ సమయంలో పారిశుధ్య కార్మికులతో రవి మాట్లాడారు.



ఉండవల్లిలో మాట్లాడుతున్న ఎం రవి

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్ : అన్ని వర్గాల కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసే, సిఐటియు గుంటూరు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని, సిఐటియు తాడేపల్లి మండల కన్వీనర్ పల్లె కృష్ణ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామ సచివాలయ పారిశుధ్య కార్మికులతో, ప్రజా సంఘాల నాయకులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ పోరాటం ద్వారానే ఏదైనా కార్మికులు సాధించు కో గలుగుతారని అన్నారు. ప్రస్తుత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కాలరాస్తూ, యజమానులకు అనుకూలంగా చట్టాలు చేస్తున్నారని కృష్ణ విమర్శించారు. పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని తుంగలో తొక్కుతూ రాష్ట్ర ప్రభుత్వం 13 గంటల పని విధానాన్ని తీసుకొచ్చే విధంగా జీవో చేయడం దుర్మార్గమని, సిఐటియు దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తుంది అన్నారు. తాడేపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాలలో భవన నిర్మాణ కార్మికులు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఆటోరంగ కార్మికులు, అంగన్వాడి, ఆశ, తదితర రంగాల కార్మికుల సమస్యల పైన సిఐటియు అండగా నిలబడి పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, కుంచనపల్లి గ్రామ అధ్యక్షులు అమ్మిశెట్టి రంగారావు, పారిశుధ్య కార్మికులు కృష్ణ తులసి, రాంబాబు, జోజి బాబు, కోటేశ్వరి, వెంకాయమ్మ, ప్రసాద్ తదితర కార్మికులు పాల్గొన్నారు.



మంగళగిరిలో మాట్లాడుతున్న ఎస్ఎస్ చెంగయ్య



కుంచనపల్లిలో మాట్లాడుతున్న పల్లె కృష్ణ

ప్రజాశక్తి మంగళగిరి : సిఐటియు మహసభలను జయప్రదం చేయాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి ఎస్ ఎస్ చెంగయ్య అన్నారు. మంగళగిరి సిఐటియు కార్యాలయంలో గురువారం రాత్రి మంగళగిరి తాడేపల్లి నగరపాల సంస్థ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సిహెచ్ పార్వతి అధ్యక్ష వహిం చారు. చెంగయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం పనిచేసేది సిఐటియు యూనియన్ మాత్రమేనని అన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో మహాసభ సందర్భంగా జరిగే ప్రదర్శనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్పొరేషన్ కమిటీ నాయకులు ఎం రవి, ఎం బాలాజీ పాల్గొన్నారు.

పేదలకు రెండు సెంట్లు ఇళ్లస్థలం మంజూరు చేయాలి : వ్యకాస

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలం లోని ఆత్మకూరులో ఇల్లు లేని పేదలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలం మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు డిమాండ్ చేశారు. గురువారం ఆత్మకూరు గ్రామంలోని దళితవాడలో ఇళ్ల స్థలాల కోసం మున్సిపల్ కమిషనర్‌కు అర్జీలు ఇచ్చిన పేదలకు రశీదులు అందజేశారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెబుతూ ఆచరణలో ఒక అడుగు కూడా ముందుకు వేయడం లేదని విమర్శించారు. కార్పొరేట్లకు తక్కువ రేటుకు వందల ఎకరాల భూములను కట్టబెడుతున్నారని పేదలకు రెండు సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వడానికి మీన మేషాలు లెక్కిస్తున్నారని, పేదల ఇల్లు అడుగుతా ఉంటే మేము టిడ్కో ఇల్లు కట్టిస్తామని చెబుతున్నారని ఇది సరైనది కాదని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం గనుక ఇళ్లస్థలాలు ఇవ్వకపోతే భవిష్యత్తులో పేదలందరిని ఐక్యం చేసి ఇళ్ల స్థలం సాధించేవరకు ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మంగళగిరి మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు, వ్యవసాయ కార్మిక సంఘం మంగళగిరి మండల కార్యదర్శి గడ్డం అజయ్, నాయకులు చింతలచెరువు జాన్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

ఐక్య పోరాటాల ద్వారానే సమస్యల పరిష్కారం : సిఐటియు

ప్రజాశక్తి - కొల్లిపర

రష్యాలో జరిగిన అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో కార్మికులు ఐక్యంగా తమ సమస్యలు పరిష్కరించుకోవటానికి ముందుకు రావాలని సిఐటియు జిల్లా నాయకులు ఎన్.భావన్నారాయణ కోరారు. గురువారం కొల్లిపర ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో జరిగిన సిఐటియు మండల మహాసభలో ఆయన ప్రసంగిం చారు. ఈ సమావేశానికి సిఐటియు మండల కన్వీనర్ ఎం జయప్రద అధ్యక్షత వహించారు. డిసెంబర్ చివరలో విశాఖ పట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలో కార్మిక వర్గ ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను ఎదుర్కోవటానికి పోరాట రూపాలను రూపొందిస్తారని, ఆ మహాసభలను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పాల్గొన్న రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా సాంబిరెడ్డి మాట్లాడుతూ కార్మికులు వివిధ రంగాలలో కమిటీలు ఏర్పాటు చేసుకొని ఐక్యంగా పనిచేయాలని కోరారు ఈ సమావేశంలో కోటా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటి యు మండల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఎం జయప్రద, కో కన్వీనర్ గా మల్లోల రమేష్ మరో 9 మందితో కన్వీనింగ్ కమిటీ ఎన్నికయింది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ భావన్నారాయణ

85 శాతం మహిళల్లో రక్తహీనత

'డోర్ టు డెస్టినేషన్' నివేదిక వెల్లడించిన డాక్టర్ శారద

రూ.3 లక్షల చెక్కు అందజేసిన నటరాజ్ జ్యుయలర్స్

ప్రజాశక్తి తెనాలి

డిసీజ్ ఫ్రీ తెనాలి నినాదంతో 'డోర్ టు డెస్టినేషన్' హెల్త్ కార్యక్రమాన్ని చేపట్టిన డి3 శారదా సర్వీస్ సొసైటీ నిర్వాహకులు డాక్టర్ డి శారద గురువారం నివేదికను వెల్లడించారు . మహిళలలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించేందుకు ఆమె రాష్ట్ర ప్రభుత్వం నుంచి డోర్ టు డెస్టినేషన్ కార్యక్రమానికి అనుమతి పొందిన సంగతి తెలిసిందే. అక్టోబర్ ఒకటి నుంచి డిసెంబర్ 31 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉంది. అయితే 50 రోజుల వ్యవధిలో ఆమె నిర్వహించిన ఆరోగ్య పరీక్షల వివరాలను, గుర్తించిన వ్యాధులను తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ సమక్షంలో వెల్లడించారు. నలుగురు మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ కాగా, మరో నలుగురికి



చెక్కును అందజేస్తున్న కొత్త మాసు కుమార్

గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు. అలాగే మరో 88 మంది మహిళలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలలో తేడాలు గుర్తించామని, 352 మందికి కొత్తగా షుగర్, 133 మందికి థైరాయిడ్, 204 మందికి బిపి ఉన్నట్లు తేలిందని, 85శాతం మహిళలలో రక్తహీనత గుర్తించినట్లు తెలిపారు. డిసీజ్ ఫ్రీ తెనాలి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు, దానికి సంబంధించి ప్రజలకు ఉపయోగపడే రీతిలో ఆసుపత్రిని, వివిధ పరీక్షలకు ఉపయోగపడే సామగ్రికి దాదాపు రూ.60 లక్షల నిధులను సమకూర్చనున్నట్లు డాక్టర్ శారద వెల్లడించారు.

రూ.3 లక్షల చెక్కు అందించిన నటరాజ్ జ్యుయలర్స్

డి3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో చేపట్టిన డిసీస్ ఫ్రీ తెనాలి కార్యక్రమానికి నటరాజ్ జ్యుయలర్స్ అధినేత కొత్త మాసు కుమార విజయభాస్కర్ స్పందించారు. రూ.3 లక్షల చెక్కును డాక్టర్ శారదకు అందించారు. తన తండ్రి కొత్త మాసు తులసీదాసు జ్ఞాపకార్థం ప్రతి ఏటా తనవంతు సహకారం అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కె వి గోపాలకృష్ణ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం పట్ల వ్యక్తిగత శ్రద్ధ చూపుతూ, ప్రాణాపాయ పరిస్థితుల నుంచి వారిని కాపాడేందుకు డాక్టర్ శారద కృషి ప్రశంసనీయమన్నారు. తన వంతు సహకారం ఎల్లవేళలా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా దాత కుమార విజయభాస్కర్ ను సత్కరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డి3 సర్వీసెస్ సొసైటీ బృందం పాల్గొన్నారు.

నేడు కార్మికులు, ఉద్యోగులకు ప్రత్యేక గ్రీవెన్స్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థపరిధిలో విధులు నిర్వహించే ప్రజారోగ్య, ఇంజినీరింగ్ కార్మికులు, ఉద్యోగులు తమ సమస్యలపై ఫిర్యాదులు, అర్జీలు అందించేందుకు ఈనెల 21న (శుక్రవారం) సాయంత్రం 3 నుండి 4 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థకు చెందిన వివిధ విభాగాల వారీగా కార్మికుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారంకు గ్రీవెన్స్ నిర్వహించనున్నామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో కార్మికులు ప్రధానంగా పిఎఫ్, ఈఎస్ఐ, రుణాలు, ఆప్కాస్ తదితర అంశాలపై, ఉద్యోగులు సమస్యలపై ఎదురవుతున్న అర్జీలను గ్రీవెన్స్ లో అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎండ్ టు ఎండ్ రోడ్ నిర్మించాలి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నూతన రోడ్లను రోడ్, డ్రైన్ మధ్య ఖాళీ లేకుండా ఎండ్ టు ఎండ్ చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఎస్‌విఎన్ కాలనీ, విద్యానగర్, ఇన్నర్ రింగ్‌రోడ్ ఫేజ్-3, వాసవి నగర్, ఏటుకూరు, తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్లను ఎండ్ టు ఎండ్ నిర్మాణం చేయడం వలన రోడ్ల పక్కనలో లెవల్ సమస్య లేకుండా, వర్షంనీరు నేరుగా డ్రైన్‌లోకి వెళ్లడానికి, ప్రజారోగ్య కార్మికులు రోడ్ శుభ్రం చేయడానికి వీలుగా ఉంటుందన్నారు. అభివద్ధి పనులు చేపట్టిన అనంతరం రోడ్లపై నిర్మాణ వ్యర్ధాలు తొలగించాలన్నారు. గుజ్జనగుండ్ల జంక్షన్ వద్ద రోడ్, డ్రైన్ ఆక్రమణలు తొలగించాలన్నారు. ప్రజారోగ్య కార్మికులతో మాట్లాడుతూ ప్రతి ఇంటి నుండి తడిపొడిగానే వ్యర్ధాలను సేకరించాలని, ప్రజలకు కూడా అవగాహన కల్పించాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్లు వి.శ్రీరాంప్రసాద్, బి.స్మితపద్మజ, డిఈఈలు రమేష్ బాబు, సతీష్‌కుమార్, ఎస్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.



కౌలు రైతులతో మాట్లాడుతున్న ములక శివ సాంబిరెడ్డి

కౌలు రైతులకు పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలి

ప్రజాశక్తి - కొల్లిపర : అన్నదాత సుఖీభవ పథకం క్రింద కౌలు రైతులకు పెట్టుబడి సాయంగా రూ. 20,000 ఇస్తామని చెప్పిన ప్రభుత్వము కౌలు రైతులకు మొండి చేయి చూపించిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మొలక శివ సాంబిరెడ్డి విమర్శించారు. గురువారం కొల్లిపర మండలంలోని శివలూరు గ్రామంలో కౌలు రైతులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చిన కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చారని ఆయన విమర్శించారు. కౌలు రైతు దర్శి మరియు దాసు యండపాటి మోషే పిల్లి శ్రీనివాసరావు లు మాట్లాడుతూ ఎకరానికి రూ.30000 ముందస్తు కౌలు చెల్లించామని మరో 30 వేలు పెట్టుబడి పెట్టామని, కౌలుకార్డులు అందరికీ ఇవ్వ లేదని, బ్యాంకు రుణాలు మంజూరు కావడం లేదని వారు తెలిపారు.

డివి ప్రకాశరావుకు పలువురు నివాళి

ప్రజాశక్తి - తెనాలి

నెహ్రూ నికేతన్ వ్యవస్థాపకులు డివి ప్రకాశరావు (80) భౌతికకాయానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి ప్రకాశరావు కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం ఉదయం నిర్వహించనున్నట్లు నెహ్రూ నికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళి కాంత్ దాసరి చెప్పారు. స్థానిక బోస్ రోడ్ లోని నెహ్రూ నికేతన్ ప్రాంగణంలో ఉంచిన ప్రకాశరావు భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, వి ఎస్ ఆర్ కళాశాల కరస్పాండెంట్ నన్నపనేని సుధాకర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు, ఏఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రామ్ చంద్ తదితరులు ఘననివాళులర్పించారు.



నరసరావుపేటలో మాట్లాడుతున్న డిఈవో ఎల్.చంద్రకళ, రెంటచింతల, మాచర్ల, సత్తెనపల్లిలో గ్రంథాలయ ముగింపు ఉత్సవాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

పుస్తకానికి మరో ప్రత్యామ్నాయం లేదు..

ప్రజాశక్తి విలేకరులు

పల్నాడు జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పుస్తకానికి మరో ప్రత్యామ్నాయం లేదన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వారోత్సవాల సందర్భంగా జరిగిన పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు గ్రంథాలయ అధికారులు బహుమతులు అందజేశారు.

పల్నాడు జిల్లా : పుస్తకానికి మరో ప్రత్యామ్నాయం లేదని గ్రంథాలయం ఓ జ్ఞాననిధి అని జిల్లా విద్యా శాఖ అధికారిణి ఎల్. చంద్రకళ అన్నారు. నరసరావుపేట శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సభ గురువారం ఏర్పాటు చేశారు. డిఇఓ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే విద్యార్థులు గ్రంథాలయాలను సందర్శించాలన్నారు. ఇంటర్నెట్ లో ఏ సమాచారమైనా లభిస్తుందని నమ్ముతున్న పరిస్థితులు, అన్ని రంగాలను ప్రభావితం చేస్తున్న త్రిమ మేదతో గ్రంథాలయాల అవసరం ఉందా? అనే ప్రశ్న తలెత్తుతుందని, అయితే పుస్తకానికి ప్రత్యా మ్నాయం లేదని ఆమె స్పష్టం చేశారు. గ్రంథాలయంలో సభ్యత్వం పొంది పుస్తకాలను ఇంటికి తీసుకు వెళ్ళి చదువుకోవాలని సూచించారు. నేటి విద్యార్థులు, యువత మొబైల్ ఫోన్ల వాడకం తగ్గించి గ్రంథాలయాలను సందర్శించాలని, చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిని యడ్లపాటి రాధా తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతల : గ్రంథాలయం వారోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి సభాధ్యక్షులుగా అధికారి రాయపాటి రాజకిషోర్ వ్యవహరించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాసరావు, మండల మాజీ వైస్ ప్రెసిడెంట్ గొంటు సుమంత్‌రెడ్డి మాట్లాడారు. వివిధ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షులు గాదె లూర్దు మర్రెడ్డి, ఎంఎస్‌పి పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు గడ్డిపర్తి శ్రీనివాసరావు మాదిగ, బిజెపి నాయకులు ఇంగుటూరి రాజశేఖర్ రెడ్డి, ఎల్ జి హెచ్ పాఠశాల ఉపాధ్యాయులు పద్మలత విద్యార్థులు పాల్గొన్నారు.

మాచర్ల : పట్టణంలోని శ్రీకాసుబ్రహ్మానందరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్‌బిఐ బ్యాంకు మేనేజర్ జయ నాగన్న, కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీ కుమారి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మోహన్ రావు, చెన్నయ్య అధ్యాపక అధ్యాపకేతర విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

దాచేపల్లి : సమాజాన్ని మార్చాలంటే పుస్తకమొక్కటే గొప్ప సాధనమని జెడ్.పి.హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎన్.సాంబయ్య అన్నారు. గురువారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి గ్రంథాలయ అధికారి శివపార్వతి అధ్యక్షత వహించారు. వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యాక్రమంలో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి, మోజెస్, ఉపాధ్యాయులు ఆర్.వెంకటేశ్వర్లు, టి.ఆనంద్‌కుమార్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఈపూరు : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ అభివృద్ధి బోర్డ్ డైరెక్టర్ రాపర్ల జగ్గారావు అన్నారు. స్థానిక శాఖ గ్రథాలయంలో వారోత్సవాల ముగింపు సభ జరిగింది. ఈ సందర్భంగా జగ్గారావు, తహశీల్దార్ ఎ.నళిని, ఎంపీడీవో ఎ.ఉమాదేవి మాట్లాడారు. వివిధ అంశాలపై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. క్షుముప్పాళ్ళ శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహకులు గంటా శ్రీనివాసరావు, ఎస్.నాగలక్ష్మి, అంగలూరు సొసైటీ చైర్ పర్సన్ టి బాలయ్య, సర్పంచ్ పి చెంచయ్య, ఉపాధ్యాయులు ఎం.నాగేశ్వరావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి టౌన్ : గ్రంథాలయం అంటే పుస్తక దేవాలయం అని మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసరావు. రాఘవేంద్ర రావులు అన్నారు. స్థానిక వైఎస్ఆర్ శాఖా గ్రంథాలయ వారోత్సవాల ముగింపు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట్లాడారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ క్విజ్, పోటీలు ,ఆటల పోటీలలో గెలిచిన విజేతలకు బహుమతుల ప్రధానం చేశారు. గ్రంథాలయాధికారి రమేష్ ఆయా పాఠశాలల ప్రధానోపా ధ్యాయులకు, పాల్గొన్న విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచికంటి వెంకటేశ్వర్లు, ఉమా మహేశ్వరరావు, విశ్రాంత గ్రంథాలయు అధికారి కె.వాణి, అన్ని పాఠశాలల విద్యారులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది రజని పాల్గొన్నారు.

పెదకూరపాడు : గ్రంథాలయ వారోత్సవాల భాగంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు గురువారం పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకటరమణ, గ్రంథాలయ అధికారి మహమ్మద్ ఆలీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి : స్థానిక గ్రంథాలయంలో అన్ని స్కూళ్ల బాలబాలికల ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈరోజు ఆఖరి రోజు కావడంతో వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి అధికారులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హనుమంతరావు, బిజెపి డిస్టిక్ సెక్రటరీ సుధాకర్, లైబ్రరీ మండల చైర్మన్ జాజిబాబు, ఎంఈఓ ప్రసాద్, శివ బాబు , దానియేలు, ఎండిఓ పార్వతి, సుబ్బారావు తదితరులుపాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ రామచంద్రారెడ్డి

ప్రతి ఒక్కరూ సేవాగుణం కలిగి ఉండాలి

ప్రజాశక్తి – మాచర్ల రూరల్

సమాజంలో ప్రతి ఒక్కరు సేవా గుణం కలిగి ఉండాలని, దాన త్యాగ సేవా గుణాలే జన్మకు సార్ధకత అని, మాచర్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక కోదండ రామలయంలో కార్తీకమాసం చివరి రోజున జరిగిన అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడక బృందం సభ్యులు 15 ఏళ్లుగా కార్తీకమాసంలో అన్నదానం చేయడం స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో భవనారి కోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, తిరుపతయ్య, రామ్మూర్తి, మొరా, వెంగళరెడ్డి, కోటిరెడ్డి, కాసులు, బ్రహ్మారావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బొల్లా రూ. 3లక్షల ఆర్థిక సాయం

ప్రజాశకి – వినుకొండ

కత్తిపోట్లకు గురై ఇబ్బంది పడుతున్న నూజెండ్ల మండలం టి.అన్నారం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త భీమనాదం వెంకటప్రసాద్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే, పీఏసీ మెంబర్ బొల్లా బ్రహ్మనాయుడు గురువారం 3 లక్షల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల టిడిపి నాయకుల చేతిలో కత్తిపోట్లకు గురై అనారోగ్యంతో బాధపడుతూ ఏ పని చేసుకోలేక ఇబ్బంది పడుతున్న వెంకట ప్రసాద్ కుటుంబాన్ని వైసిపి ఆదుకుందని, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 2 లక్షల ఆర్థిక సహాయం చెక్కు, తాను లక్ష రూపాయలు ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.

రోడ్లపై పశువులు సంచరిస్తే జరిమనా

ప్రజాశక్తి – మాచర్ల

మాచర్ల పురపాలక సంఘ పరధిలోని వీధుల్లో రోడ్లపై పశులువు సంచరిస్తే రూ. 5 వేలు జరమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ డి. వేణుబాబు హెచ్చరిచారు. పట్టణ ముఖ్య కూడళ్లలో, మెయిన్ రోడ్‌లో ఆవులు, దూడలు విచ్చలవిడిగా తిరుగుతూ స్థానికులను గాయపరుస్తున్నాయని తెలిపారు. గాయపరుస్తున్నట్లు చెప్పారు. వెళ్ళనప్పుడు ట్రాఫిక్‌కు అంతరాయము కలిగిస్తున్నాయన్నారు. ఆవుల యజమానులకు వారి ఆవులను ఇంటి వద్దనే కట్టివేయాలని, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వదిలితే వాటిని బందెల దొడ్డికి తరలిస్తామన్నారు.

నేడు విద్యార్థులకు బహుమతుల ప్రధానం

ప్రజాశక్తి – మాచర్ల రూరల్

రోటరీ యువజన ఉత్సవాలు కార్యక్రమంలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల ప్రతి సంవత్సరం నిర్వహించే వ్యాసరచన, వకఅత్వము, డ్రాయింగ్,చెస్, క్విజ్, డాన్స్, వివిధ క్రీడా అంశాలపై గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు ప్రధానం చేయునున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు తుమ్మల సత్యప్రసాద్ గురువారం తెలిపారు. నియోజకవర్గంలోని మాచర్ల, దుర్గి, వెల్దుర్తి మండలాలకు సంబంధించిన వివిధ పాఠశాలల 350 మందికిపైగా విద్యార్థులకు మెమొంటోలు, సర్టిఫికెట్లు,మెడల్స్ బహుకరించనున్నట్లు చెప్పారు.

అభివృద్ధి పనులకు 8.5 కోట్లు

ప్రజాశక్తి–ఈపూరు

మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో 2024-25 సంవత్సరానికి సంబంధించి 544 పనులకు రూ.8,38,22,318 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు ఎంపీడీవో ఎ.ఉమాదేవి తెలిపారు. సామాజిక తనిఖీ బృందానికి ఉపాధి హామీ సిబ్బంది సక్రమంగా రికార్డులు అందజేసి వారికి సహకరించాలని సూచించారు. అనంతరం ఎస్ఆర్పి బత్తుల ఆవులయ్య ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, అటవీ శాఖ,వెలుగు సిబ్బందితో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శివరామకృష్ణ, ఏపీఓ పుష్పరాజు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై దృష్టి సారించండి : పుల్లారెడ్డి

ప్రజాశక్తి–పల్నాడు జిల్లా

విద్యుత్ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేలా దృష్టి సారించాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి జిల్లా విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని జొన్నలగడ్డ గ్రామ పరిధిలో గల విద్యుత్ జిల్లా శాఖ కార్యాలయంలో పల్నాడు జిల్లా అధికారి సూపరిండెంటింగ్ ఇంజినీర్ డాక్టర్ ప్రత్తిపాటి విజయకుమార్ అధ్యక్షతన పల్నాడు సర్కిల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ వినియోగదారులకు నిరంతరంగా విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని, నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చూడాలన్నారు. విద్యుత్ బకాయిలు వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని సూచించారు. ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకంపై వినియోగదారులకు మెరుగైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్లు, ఎ.మురళికృష్ణ యాదవ్, టి.వి.ఎస్.ఎన్. మూర్తి, వెంకటేశ్వర్లు, పల్నాడు సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సీనియర్ అకౌంట్ ఆఫీసర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఎండి పుల్లారెడ్డి

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి – వినుకొండ

మండలంలోని ఏనుగుపాలెంలో ఉచిత పశువైద్య శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా అసిస్టెంట్ డైరెక్టర్ నేలవల్లి శ్రీరాములు మాట్లాడుతూ పాడి పశువులు ఉన్న రైతులు ప్రభుత్వం సబ్సిడీపై గేదేలకు ఆడదూడ జన్మించే సెక్స్ స్టార్టెడ్ సెమెన్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పశు సంవర్ధక శాఖ రాష్ట్రీయ గోకుల్ మిషన్ అధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఏడి డాక్టర్ నేలవల్లి శ్రీరాములు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వినుకొండ మండలం పశువైద్యాధికారి డాక్టర్ పి.అమీర్ బాషా, నూజెండ్ల మండలం పశువైద్యాధికారి డాక్టర్ డి.శివాజీ, గ్రామ నాయకులు మాదినేని ఆంజనేయులు, గుమ్మా సీతా రామయ్య, గుమ్మా మల్లికార్జున, షేక్ పెద్ద నాగుర్ వలి, పశు సంవర్ధక సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి : ఎమ్మెల్యే చదలవాడ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవిందబాబు

ప్రజాశక్తి–పల్నాడు జిల్లా

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సూచించారు. ప్లాస్టిక్ కవర్ల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం స్థానిక ఆర్.టి.సి. బస్టాండ్ ప్రాంతంలోని వ్యాపార సముదాయం, మార్కెట్ యార్డ్ చుట్టుపక్కల ఉన్న షాపుల వద్ద ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వ్యాపారులతో మాట్లాడారు. ప్లాస్టిక్ కవర్స్ వద్దు – జూట్ కవర్స్ ముద్దు అనే నినాదంతో ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని ఆయన కోరారు. ప్రతి షాపుకు వెళ్లి వ్యాపారుల చేతుల్లో జూట్ బ్యాగులు అందజేస్తూ, ప్లాస్టిక్ నిషేధం గురించి వివరించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతఅని, ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను అర్థం చేసుకుని, ప్రతి ఒక్కరూ జూట్, క్లాత్ బ్యాగులు వాడితేనే భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం అందించగలమన్నారు. వార్డు, పంచాయతీలో స్వయం శక్తి సంఘాలు, జాతీయ సేవా పథకం వాలంటీర్లు, ఎన్.సి.సి సహకారంతో ప్లాస్టిక్ నిర్మూలనకు తమ వంతు కఅషి చేస్తానన్నారు. జూట్, క్లాత్, పామ్ ఉత్పత్తుల డ్వాక్రా సంఘాల మహిళలకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్, వార్డు అధికారులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి – వెల్దుర్తి

విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉప్పలపాడు ఆరోగ్య కేంద్ర వైద్యురాలు యోగేశ్వరి తెలిపారు. గురువారం ఆమె స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా యోగేశ్వరి సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించిన ఉచిత మందులను అందజేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గంగాభవాని, సూపర్‌వైజర్ ఏడుకొండలు, ఉపాధ్యాయ బృందం వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





తెనాలి, ప్రత్తిపాడు, పెదనందిపాడులో జరిగిన గ్రంథాలయ ముగింపు ఉత్సవాలలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

అట్టహాసంగా ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి విలేకరులు

జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. వారోత్సవాల సందర్భంగా జరిగిన పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు గ్రంథాలయ అధికారులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగాలరాలని కొనియాడారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

తెనాలి : పుస్తక పఠనంతో జ్ఞానం, మానసిక ఆరోగ్యం వంటి ప్రయోజనాలు కలుగుతాయని మండల విద్యాధికారి వి. జయంత్ బాబు అన్నారు. స్థానిక కొత్తపేట మహిళా బాలల గ్రంథాలయంలో గ్రంథాలయాల వారోత్సవాలు ముగింపు సభ గురువారం జరిగింది. జిల్లా శాఖ గ్రంథాలయ కార్యదర్శి వంకధార సుబ్బరత్నమ్మ, మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయ అధికారిణి కె.సుజాత, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ కార్యదర్శి లక్కరాజు సాయి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎ.బాలచంద్రమౌళి, సిహెచ్.శ్రీదేవి, టి.శివశంకర్, ఎ.వెంకటేశ్వరరావు, షేక్ నాగుల్‌షరీఫ్, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో

స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు సభలో మండల విద్యాధికారులు డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతి బాబు మాట్లాడారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.రచయిత గద్వాల సోమన్న రచించిన పాలపిట్ట గ్రంథాన్ని ఆవిష్కరించారు. మధురకవి నాళం కృష్ణారావు పురస్కారాన్ని రాయప్రోలు జగదీశ్వర శర్మకు, డాక్టర్ వెలగా వెంకటప్పయ్య పురస్కారాన్ని కావూరి రమాదేవికి అందించి సత్కరించారు. ఇంచార్జ్ లైబ్రేరియన్ ఎస్.లావణ్యసుధ, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఇ.ఎల్.వి. అప్పారావు, వి.సత్యనారాయణ, పి.శ్రీనివాసరావు, వి.మానవీంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు : ప్రత్తిపాడులో గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ముగిశాయి. స్థానిక శాఖ అధికారి బి.అరుణ కుమారి, టిడిపి మండల కార్యదర్శి గింజుపల్లి శివరామ్ ప్రసాద్ మాట్లాడారు. అనంతరం వారోత్సవాలలో బాగంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వార్డు మెంబరు కాకాని సురేష్, డి.వెంకటేశ్వర్లు, చిన్నం శ్రీకాంత్, గిరిజవేలు శ్రీనివాస రావు, కాసు పెంటరెడ్డి, రిటైర్డ్ గ్రంథాలయ ఉద్యోగులు సుభాని, గురవయ్య పాల్గొన్నారు.

తాడేపల్లి : గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అధికారులు గురువారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడేపల్లి ఎంఈఓ డి.నాగేశ్వరరావు, మాచవరం ఎంఈఓ నరేంద్ర, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.వెంకటేశ్వరరావు, డి.సునీత, రవీంద్ర భారతి పాఠశాల కరస్పాండెంట్ ఖమర్ హుస్సేన్, శ్రీ భగవాన్ పాఠశాల నుంచి శ్రీనివాస రావు, జయ శారద పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడంతో ఈ గ్రంథాలయ వారోత్సవాలు ముగిసినట్లు గ్రంథాలయ అధికారి షేక్ నాగూర్ బాషా తెలిపారు.

తుళ్లూరు : పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మండల విద్యాశా ఖాధికారి అజయ్ కుమార్ గురువారం బహుమతులు, ప్రసంశా పత్రాలను అందజేశారు. వారోత్సవాల విజయవంతానికి సహకరించిన గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు తదితరులకు గ్రంథాలయాధికారి పి.భాగ్యలత కృతజ్ఞతలు తెలిపారు.

పెదనందిపాడు : గ్రంథలయాలు విజ్ఞాన భాండాగారాలని పుస్తక పఠనం వలన మానసిక ఉల్లాసం కలిగి, మేధాశక్తి పెరుగుతుందని అభివృద్ధి కమిటీ చైర్మన్ ముద్దన రాఘవయ్య తెలిపారు. గ్రంథాలయవారోత్సవాల ముగింపు సభకు గేరా మోహనరావు అధ్యక్షతన నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు రావి శివరామ కృష్ణయ్య, అశోక హైస్కూల్ డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ, మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకురాలు డి.శివనాగేశ్వరరావు, బి.వెంకటేశ్వర్లు, పుష్పావతి, కె.మంజుల తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని : స్థానిక గ్రంథాలయంలో గురువారం అక్షరాస్యతా దినోత్సవం, డిజిటల్ గ్రంథాలయాలు, చదవడం మాకిష్టంపై విద్యార్థులకు, పాఠకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాంలో గ్రామ సర్పంచ్ గొళ్ళ స్వరూప రాణి, ఉప సర్పంచ్ వలివేటి మురళీకృష్ణ మాట్లాడారు. శ్రీ సాయి సిద్ధార్థ ప్లే మోడల్ స్కూల్ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి నంద్యాల నాగిరెడ్డి, ఎస్.సంగీతరావు, పి.మంత్రయ్య, బి. ప్రవీణ్, ప్రియాంక, ప్రభాకర్, ఏసు పాదం, బుజ్జి పాల్గొన్నారు.

దుగ్గిరాల : వారం రోజులపాటు నిర్వహించిన గ్రంథాలయ ఉత్సవాలు గురువారం ముగశాయి. పోటీల్లో గెలుపొందిన పలువురు విద్యార్థులకు బహుమతులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఐ.సునీత, మిక్కిలినేని గాంధీ, గద్దె రవీంద్ర, కొత్త సుబ్రహ్మణ్యం, జంపాల సాంబశివరావు, గ్రామీణ గ్రంథాలయ అధికారి ఎ.భూషయ్య, ఇన్‌చార్జి లైబ్రేరియన్ బి.జ్యోతి పాల్గొన్నారు.

మంగళగిరి : గ్రంథాలయ వారోత్సవాల స్థానిక శాఖ గ్రంథాలయంలో ఘనంగా ముగిశాయి. ఎంఈఓ 1 ఎన్.ఉషకుమారి, రిటైర్డ్ ఎంఈఓ సిహెచ్.జార్జి మాట్లాడారు. గ్రంథాలయ అధికారి ఎన్.ఆరోగ్యం అధ్యక్ష వహించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్ఎన్ చైతన్య హై స్కూల్ డైరెక్టర్ సిందే బాలకృష్ణ, గ్రంథాలయ సిబ్బంది పి.కృష్ణ, కె.సుబ్బారావు, ఎస్.కె.గఫూర్, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.





తుళ్లూరు, పెదకాకాని, మంగళగిరిలలో జరిగిన గ్రంథాలయ ముగింపు ఉత్సవాలకు హాజరైన విద్యార్థులు, అధికారులు



అన్నదానం చేస్తున్న పండేటి సాంబశివరావు

అన్నప్రసాద వితరణ

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక శివాలయం వద్ద ఉన్న పానకాల లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం మెట్ల మార్గం దగ్గర శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం అన్న వితరణ చేశారు .ట్రస్ట్ చైర్మన్ పండేటి సాంబశివరావు యాత్రికులకు భోజనాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ గౌరవ అధ్యక్షులు పుప్పాల కోటేశ్వరరావు, గుద్ధంటి మురహరి, కగ్గా శ్రీనివాసరావు, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, మారం మల్లికార్జునరావు, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, కోదాడ శ్రీనివాసరావు, భోజనపల్లి తాండవ, ఆలూరి ఉమామహేశ్వర రావు, గండికోట అచ్చయ్య, కటారి విష్ణుమూర్తి, ముద్రబోయిన శ్రీనివాసరావు, రెడ్డి వీర రాఘవులు, చిరుమామిళ్ల రంగారావు, నూతలపాటి వెంకటేశ్వరరావు, పేరు బోయిన వెంకటేశ్వర రావు, పండేటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేకుండా ప్రణాళిక : ఏవో సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండలంలో ఎరువుల కొరత లేకుండా ప్రణాళిక ఏర్పాటు చేసినట్లు ఏవో సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం ఆయన ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రబీ సీజన్ గాను శనగ, మొక్కజన్న, మిరప మరియు ఇతర పంటలు కలిపి 15,000 నుంచి 16,000 ఎకరాలలో సాగయ్యే అవకాశం ఉందన్నారు. యూరియా 1100 మెట్రిక్ టన్నులు, డిఏపి 900 మెట్రిక్ టన్నులు అవసరమవుతుందని తెలిపారు. రైతుల యొక్క అవసరాల నిమిత్తం 200 మెట్రిక్ టన్నుల యూరియా, 100 టన్నులు డిఏపికి ఇండెంట్ పెట్టడం పెట్టినట్లు తెలిపారు. రెండు రోజుల్లో ఎరువులు మండలానికి సరఫరా అవుతాయని, రైతులు ఎవరు ఎరువులు కొరకు ఆందోళన చెందవద్దని తెలియజేశారు.



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏవో సుబ్రహ్మణ్యం

వెల్లలూరులో ఎన్ఎస్ఎస్ క్యాంపు

ప్రజాశక్తి - పొన్నూరు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేబ్రోలు, ఎన్ ఎస్ ఎస్ యూనిట్ వారు 'వెల్లలూరు' గ్రామంలో గురువారం స్పెషల్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ఈనెల 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీదేవి తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీదేవి అధ్యక్షత వహించారు. గ్రామ సర్పంచ్ ఇక్కుర్తి మల్లికార్జునరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థి దశలో సమాజ సేవ చేయడానికి ఎన్ఎస్ఎస్ ప్రధానమైన మార్గమని పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ మల్లికార్జున రావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో గ్రామంలోని సమస్యలను గుర్తించి సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి సూదా అంకమ్మరావు, గూడపాటి కాళేశ్వరరావు, ఎంపీటీసీ అంబటి రాఘవయ్య , విద్యా కమిటీ చైర్మన్ నాగరాజు, కొసనా శ్రీనివాసరావు, సూదాం వసంత్, పుష్పాల హరిబాబు, పంచాయతీ సెక్రెటరీ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.




దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

352వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

చట్టపరంగా తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారం నాటికి 352వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను నాయకులు కూరపాటి స్టీవెన్, బూరగ అంకయ్య, ఎం.ఆశీర్వాదం, సిహెచ్. పిచ్చయ్య, తుపాకుల నాగేశ్వరావు ప్రారంభించారు. దీక్షల్లో మహిళలు వేము రిబ్కా, వి.లక్ష్మి, మొలక శారదా, దేరంగుల రమణమ్మ, దామవరపు సువర్ణకుమారి కూర్చున్నారు. కార్యక్రమంలో వై.సాంబశివరావు, డి.నాగేశ్వ రావు, వి.వెంకటేశ్వరరావు, కె.హగ్గయ్య, ఆర్.ఇశ్రాయిల్, ఎ.దేవరాజు, సూర్యప్రకాష్, శారమ్మా, రమాదేవి, దుర్గాభ వాని, జి.అన్నమ్మ, నాగమల్లీశ్వరి పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

అన్న క్యాంటీన్ పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వెనుక రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌ను గురువారం మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు పరిశీలించారు. క్యాంటీన్‌లో ఉదయం పూట వినియోగదారులకు అందుబాటులో ఉన్న టిఫిన్ వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అక్కడే టిఫిన్ రుచి చూశారు. సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మున్సిపల్ ఆరోగ్యాధికారి ఎం.ఏసుబాబు, సిబ్బంది ఉన్నారు.



మాట్లాడుతున్న కేసన శంకరరావు

24న కలెక్టర్లకు బీసీల గోడు వినిపిస్తాం

ప్రజాశక్తి - మంగళగిరి

బీసీల జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లు, ఏ బిసిడిలుగా వర్గీకరించి చట్టబద్ధంగా అమలు చేయాలని సంఘం అన్ని జిల్లాల అధ్యక్షులు ఈనెల 24 గ్రీవెన్స్ డేరోజున అన్ని కలెక్టర్ల ద్వారా పీఎం, సీఎంలకు వినతిపత్రాలను సమర్పిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తెలియజేశారు. స్థానిక రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుమ్మర క్రాంతి కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం బాబాజీ, ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకా వెంకటేశ్వరరావు, బీసీ ఉద్యోగ విభాగ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, విజయవాడ నగర అధ్యక్షులు చిప్పాడ చందు, సీనియర్ బీసీ నాయకులు వాకా వెంకటేశ్వరరావు, ఆలా శివాజీ, వాడల నాగరాజు, వెంకటసుబ్బయ్య, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

26న రాజ్యాంగ వజ్రోత్సవ సభ

ప్రజాశక్తి - తుళ్లూరు

ఈనెల 26న స్థానిక హెచ్ఎస్ఆర్ కల్యాణ మండపంలో రాజ్యాంగ వజ్రోత్సవ సభ జరుగుతుందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

26న జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘం సమావేశాలు ఈనెల 26న జెడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతిబాసు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి స్థాయి సంఘం (ప్లానింగ్ మరియు ఫైనాన్స్), రెండవ స్థాయి సంఘం (గ్రామీణ అభివద్ధి), నాలుగవ స్థాయి సంఘం (విద్య మరియు వైద్యం), ఏడవ స్థాయి సంఘ (పనులు) సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హేనీ క్రిస్టినా ఆధ్యక్షతన చైర్ పర్సన్ ఛాంబర్లో, ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. అలాగే మూడవ స్థాయి సంఘ (వ్యవసాయం) సమావేశం జిల్లా ప్రజా పరిషత్ వైస్ చైర్మన్ సొంఠిరెడ్డి నర్సిరెడ్డి అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ నాన్ ఏసీ మీటింగ్ హాల్లో, ఐదవ స్థాయి సంఘ (మహిళా సంక్షేమం) సమావేశం తెనాలి జడ్పిటిసి పిల్లి ఉమా ప్రణతీ అధ్యక్షతన డిప్యూటీ సీఈఓ ఛాంబర్‌లో, ఆరవ స్థాయి సంఘ (సాంఘిక సంక్షేమం) సమావేశం జిల్లా ప్రజా పరిషత్ వైస్ చైర్మన్ బత్తుల అనురాధ అధ్యక్షతన సీఈఓ ఛాంబర్ లో ఉదయం 10:30 గంటల నుంచి 11:30 వరకు జరుగుతాయని తెలియజేశారు.

ఎఎన్‌యు దూరవిద్య పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో జూలై, ఆగస్టులో జరిగిన పలు పీజీ కోర్సుల పరీక్ష ఫలితాలను దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, పరీక్షల విభాగ కోఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రను గురువారం విడుదల చేశారు. ఎంఏ ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, హిందీ, తెలుగు, ఇంగ్లీష్, జర్నలిజం, సోషియాలజీ, సోషల్ వర్క్, తెలుగు, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, స్టాటస్టిక్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, బోటనీ, మైక్రో బయాలజీ, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఐటీ, సైకాలజీ, ఎం కామ్, ఎంబీఏ, ఎంసీఏ, హెచ్ఆర్ఎం, ఎం ఎల్ ఐ సి, బిఎల్ఐసి అన్ని సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. పీజీ కోర్సులకు రీవాల్యుయేషన్‌కు ప్రతి పేపర్ కు రూ. 960 చొప్పున ఈనెల 29వ తేదీలోగా ఫీజు చెల్లించాలని, దరఖాస్తులు డిసెంబర్ రెండవ తేదీ లోగా అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలను వర్సిటీ వెబ్సైట్ నుండి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పరీక్షల విభాగ డిప్యూటీ రిజిస్ట్రార్ జైనలుద్దీన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ లు కష్ణవేణి, కోదండపాణి, సూపర్డెంట్ వెంకటప్ప రెడ్డి, దూరవిద్య కేంద్రం ఐ సి టి డివిజన్ డైరెక్టర్ ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎల్.ఎల్.బి ఫలితాలు విడుదల


ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో ఏప్రిల్ ఫిబ్రవరి నెలలో జరిగిన ఎల్.ఎల్.బి ఐదు సంవత్సరాల మొదటి సెమిస్టర్, మూడో సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు సీఈ ఆలపాటి శివప్రసాద్ తెలిపారు. ఫలితాలను వెబ్సైట్ నుండి పొందవచ్చునని అన్నారు


విద్యార్థులకు మెమొంటోలు అందచేస్తున్న ప్రిన్సిపాల్

చిప్స్‌లో ముగిసిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు

చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కాలేజిలో 14వ తేదీ నుండి 20 వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ముగిశాయి. కళాశాలలోని గ్రంథాలయ విభాగము, ఎన్.ఎస్.ఎస్ యూనిట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈవారోత్సవాలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యదేవర విద్యాధర తెలిపారు. ఈ వారోత్సవాలలో భాగంగా విద్యార్థులకు బెంగళూరుకు చెందిన ఇన్ఫర్మాటిక్స్ ఇండియా లిమిటెడ్ వారి 'జె- గేట్' ఎలక్ట్రానిక్ రిసోర్స్ యొక్క వినియోగంపై అవగాహన కార్యక్రమం, 'ఇంపార్టెన్స్ అఫ్ బుక్ రీడింగ్ ఇన్ ది డిజిటల్ ఎరా' అనే అంశముపై వక్తత్వ పోటీ, బుక్ రివ్యూ రైటింగ్, లైబ్రరీ ట్రెజర్ హంట్ పోటీలు, లైబ్రరీ ఎక్సటెన్షన్ సర్వీసెస్‌లో భాగంగా బుక్ ఎగ్జిబిషన్ కూడా నిర్వహించారు. బెస్ట్ లైబ్రరీ యూజర్లకు, రచన, వక్తృత్వ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంశా పత్రాలు, బహుమతులు అందజేశారు.


ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో టిజెపిఎస్ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-గుంటూరు

గ్రామాలకు సేవ చేస్తే దేశానికి సేవ చేసినట్టేనని మహాత్మా గాంధీ మాటలలో పల్లెట్టూళ్ళు పట్టణాలకు పట్టు కొమ్మలు నానుడిని నిజం చేస్తూ టిజెపిఎస్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం అన్నారు. ఈనెల 8 నుండి 14వ తేదీ వరకూ కళాశాల దత్తత గ్రామం అయిన చల్లావారిపాలెంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో పాల్గొన్న వాలంటీర్లకు గురువారం ప్రశంసాపత్రాలు అందచేసి అభినందించారు. మండవ శ్యాంసుందర్‌రావు మాట్లాడుతూ సమాజానికి అవసమైన కార్యక్రమాలు చేయాలని, మీరు చేసే సేవ వలన సమాజం జాగతం కావాలని, ప్రత్యేక శిబిరం ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి. హెచ్ కామేశ్వరశాస్త్రి, ఎన్ఎస్ఎస్ పథకం నోడల్ అధికారి డాక్టర్ జె.వి.సుధీర్‌కుమార్, కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి ఆర్.జయ శైలజ పాల్గొన్నారు.

మరుగుదొడ్ల అవశ్యకతను తెలియజేయాలి : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

మరుగుదొడ్ల అవశ్యకతను ప్రతి ఒక్కరికి తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. వరల్డ్ టాయిలెట్స్ డే సందర్భంగా జిల్లా పారిశుధ్య కమిటీ రూపొందించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మరుగుదొడ్ల విశిష్టతను, ఆవశ్యకతను వివరించాలన్నారు. ఎక్కడా బహిరంగ మలవిసర్జన జరగరాదని చెప్పారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ నవంబర్ 21 నుండి డిసెంబర్ 5వ తేదీ వరకు మరుగుదొడ్ల మరమ్మతులు, ఇతర నిర్వహణ కార్యక్రమాలు చేపట్టడానికి, డిసెంబర్ 6 నుండి 9వ తేదీ వరకు మరుగుదొడ్ల సుందరీ కరణ అవశ్యకత సర్వే చేపట్టడం, డిసెంబర్ 10వ తేదీన కార్యక్రమం ముగింపు, మరుగుదొడ్ల చక్కటి నిర్వహణ, సుందరీకరణకు అవార్డుల బహుకరణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

పగటిపూట భారీ వాహనాలకు అనుమతి లేదు : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో హెవీ లోడర్ వాహనాలు రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకే అనుమతి ఉందని, నిబంధనలు మీరిన వాహనాలను సీజ్ చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ట్రాన్స్పోర్టు, ట్రాఫిక్ పోలీస్, జిఎంసి అధికారు లతో రోడ్డు భద్రత కమిటి సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లా డుతూ గుంటూరు నగరపాలక సంస్థ గత ఏడాది కాలంగా విస్తృతంగా ప్రజసౌకర్యార్థం ఎండ్ టు ఎండ్ సిసి లేదా బిటి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపట్టామన్నారు. పరిధికి మించి లోడ్‌తో భారీ వాహనాలు నగరంలో విశృంఖలంగా రావడం వలన రోడ్, డ్రైన్ నెట్ వర్క్ సిస్టం దెబ్బతింటుందన్నారు. అలాగే వాహనాల్లోని ఇసుక, కంకర రోడ్ల మీదపడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తమ దృష్టికి తెచ్చారన్నారు. ఇప్పటికే పలుమార్లు ఆయా వాహనాలను నిలిపి వివరించినా మార్పు లేదన్నారు. ఇక నుండి నగరంలో ప్రవేశించే ప్రధాన మార్గాలు, సెంటర్లలో 24 గంటలు పర్యవేక్షణ చేస్తూ, నిబంధనలు మీరి నగరంలోకి వచ్చే భారీ వాహనాలను సీజ్ చేయడానికి ట్రాన్స్పోర్ట్, ట్రాఫిక్ పోలీస్, జిఎంసి సిబ్బంది సంయుక్తంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరంలో జరిగే ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణ పనులకు అత్యవసరమైతే జిఎంసి నుండి ప్రత్యేక అనుమతి తీసుకున్న తర్వాతే నిర్దేశిత సమయానికి ముందు వాహనాలు రావడానికి అనుమతి ఇస్తామన్నారు. నగర ప్రజలు కూడా రాత్రి 10 గంటలకి ముందు, ఉదయం 6 గంటల తర్వాత ఎక్కడైనా భారీ ట్రాన్స్ పోర్ట్ వాహనాలు నగరంలో గమనిస్తే జిఎంసి కాల్ సెంటర్ 08632345103కి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కనుక వాహన యజమానులు ప్రజా సౌకర్యార్థం తీసుకుంటున్న నిర్ణయాలను గమనించి, సహకరించాలని కోరారు. అలాగే నగరంలో వెండింగ్ జోన్లలో పాయింట్స్ గుర్తించి, వాటికి కౌన్సిల్ ఆమోదం కూడా పొందామన్నారు. జోన్లలో వీధి వ్యాపారులను షిఫ్ట్ చేయడానికి జిఎంసి, ట్రాఫిక్ పోలీసులు సంయుక్త కార్యాచరణ తీసుకుంటామని చెప్పారు. నగరంలో పార్కింగ్ జోన్స్ ఏర్పాటుచేసి, వాటిని స్వయం సహాయక సంఘాల ద్వారా నిర్వహిస్తామన్నారు. కొత్తపేటలోని వివిధ హాస్పిటల్స్ సెల్లార్‌లను పార్కింగ్‌కే వినియోగించాలని, రోడ్ల మీద పార్కింగ్ చేస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో జిఎంసి సిటి ప్లానర్ రాంబాబు, ఆర్టీఓ శ్రీహరి, ఎంవిఐ సౌజన్య, పట్టాభిపురం సిఐ వెంకటేశ్వర్లు, వెస్ట్ ట్రాఫిక్ సిఐ సింగయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

25 వరకూ లలితా హస్పిటలో పురుషులకు స్క్రీనింగ్ పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

అంతర్జాతీయ పురుషుల దినోత్సవం సందర్భంగా కొత్తపేటలోని లలితా హాస్పిటల్‌లో పురుషులకు ఈనెల 25వ తేదీ వరకు స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు అడ్వాన్స్ కార్డియోవాస్క్యులర్ ఇంటర్వెన్షన్ విభాగం అధిపతి డాక్టర్ పొలవరపు అనురాగ్ తెలిపారు. ఈ శిబిరాన్ని డాక్టర్ అనురాగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనురాగ్ మాట్లాడుతూ పురుషులు రోజువారీ జీవితంలో ఎదుర్కొనే సవాళ్లు, ఒత్తిడి, అలవాట్లు, జీవనశైలి కారణంగా బిపి, డయాబెటిస్, గుండె సమస్యలు, పక్షవాతం త్వరగా గుర్తించాల్సిన అవసరం ఉందని తెలిపారు. దీనికోసం ఈ శిబిరంలో బిపి, బ్లడ్ షుగర్, బిఎంఐ, ఈసిజి, హెచ్‌బిఎ1సి, లిపిడ్ ప్రొఫైల్, సీరం క్రియాటినిన్ పరీక్షలు ఉచితంగా నిర్వహించటం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి ఇతర పరీక్షలు 50శాతం రాయితీతో అందించబడతాయన్నారు. 30 సంవత్సరాల పైబడిన పురుషులు, ముఖ్యంగా బిపి, షుగర్ ఉన్నవారు, కుటుంబంలో బిపి, షుగర్, గుండె జబ్బులు లేదా పక్షవాతం ఉన్నవారు, ధూమపానం, మద్యం అలవాటు ఉన్నవారు, గురక పెట్టేవారు/నిద్రలో శ్వాస ఆడకపోవడం ఉన్నవారు, థైరాయిడ్ సమస్యలు, ఊబకాయం, గైనీకోమాస్టియా, హెర్నియా, లైంగిక ఆరోగ్య సమస్యలు, వెరికోస్ వీన్స్, ఉన్నవారు ఈశిబిరం ద్వారా ప్రయోజనం పొందవచ్చన్నారు. శిబిరం ప్రారంభోత్సవంలో యూరాలజిస్ట్ డాక్టర్ సరవణ కుమార్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ జయదీప్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ రత్నాకర్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ ప్రదీప్, పల్మనాలజిస్ట్ డాక్టర్ ఉజ్వల్ జైన్ తదితరులు హాజరయ్యారు.


స్క్రీనింగ్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ అనురాగ్

శ్రీమేధ కాలేజీలో రాజ్యాంగపై పోటీ పరీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని శ్రీమేధా కాలేజిలో భారత రాజ్యాంగంపై గురువారం పోటీ పరీక్షలు నిర్వహించారు. రాజ్యాంగ చరిత్ర, మూలాధికారాలు, విధులు, కేంద్ర, రాష్ట్ర నిర్మాణం, రాజ్యాంగ ప్రత్యేకతలు తదితర అంశాలపై పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిఆర్ఓ ఎన్ఎస్‌కె.ఖాజావలి మాట్లాడుతూ రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా అంబేద్కర్ ఆధ్వర్యంలో 2 సంవత్సరాల 11 నెలల, 18 రోజులపాటు అనేక చర్చలు, సవరణలు, మార్పుల తర్వాత రాజ్యాంగం పూర్తి అయ్యిందన్నారు. అలా తయారైన రాజ్యాంగాన్ని 1949 నవంబర్ 26న రాజ్యాంగ సభ ఆమోదించిందని తెలియజేశారు. సమాజంలో అసమానతలు తొలగించేందుకు, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించటానికి రాజ్యాంగం మార్గం చూపిందన్నారు. ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థినులు కె.దేవిభార్గవ, ఎస్.కె.సలీమా, ఎస్‌డి ఆర్షియా, షేక్.మహిమ, కె.షకీనాను మెమోంటో, ప్రశంసాపత్రాలతో అభినందించారు. కార్యక్రమంలో శ్రీమేధా విద్యా సంస్థల డైరెక్టర్ సిఎ. అన్నా నందకిషోర్, సముద్రాల కోటేశ్వరరావు, విల్సన్ పాల్గొన్నారు.


గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న డిఆర్ఓ